

జగనన్న.. భూ భక్ష



పథకం రద్దుతోనే రక్షణంటున్న రైతులు

భూ సమస్యలు.. భూ వివాదాల పరిష్కారం కోసమంటూ గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూ రక్ష పథకం సరికొత్త సమస్యలు తీసుకొచ్చింది. భూ రక్ష మాటేమో కానీ పలువురి భూములను మాయం చేసి భూ భక్ష పథకంగా మారింది. సర్వే అనంతరం గతంలో కంటే అత్యధికంగా భూ సమస్యలు, వివాదాలు నెలకొన్నాయంటే ఈ పథకం ఎంత లోపభూయిష్టంగా జరిగిందో తెలుస్తోంది. ఈ పథకం లోపాల పుట్టగా మారిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్ట్' గా పేరు మార్చింది. అయితే సర్వే అనంతరం నెలకొన్న సమస్యల గురించి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని.. అసలు పథకాన్ని, సర్వేను రద్దు చేయాలని భూ బాధితులు డిమాండ్ చేస్తున్నారు. వంశపారంపర్యంగా వచ్చిన రైతుల భూ హక్కులను హరించిన అప్పటి సర్వేనే రద్దు చేయాలని రైతులు, రైతు సంఘాల డిమాండ్ చేస్తున్నాయి.



ఎందరో మనోవేదన

పాత కాలం వదిలేస్తే, బ్రిటిష్ కాలంలో 1906 నుంచి 1927 వరకు రీ సర్వే జరిపారు. దీనిలో జరిగిన లోటుపాట్లను సవరించడానికి మరో పదేళ్లు దీనిని పొడిగించారు. ఆ తర్వాత కూడా సర్వేలు జరుగుతూనే వచ్చాయి. అయితే ఇంతటి తక్కువ కాలంలో చేయగలిగే అవకాశం ఇప్పుడున్నా, సాంకేతికతను పక్కనపెట్టి, కాగిత ఆధారాలు పట్టించుకోకుండా రెండేళ్లలో చేసిన సర్వే రైతుల హక్కును భక్షించేసింది. విదేశాల్లో ఉన్నవారికైతే నేటికీ వారి భూముల పరిస్థితి ఏమిటనేది తెలియని పరిస్థితి. ఒకవేళ రికార్డులు తారుమారయ్యాయని తెలిసినా, అక్కడి నుంచి వచ్చి తిరగలేని పరిస్థితుల్లో మనోవేదనకు గురవుతున్న వారూ ఉన్నారు.

వైసీపీ నేతల మాటలతోనే..

భూముల రీ సర్వేలో దస్తావేజులు, పాస్ పుస్తకాలతో పని లేదు. వెబ్‌లాండ్ రిజిష్టర్, అడంగల్, ఈసీ వంటివి కూడా అవసరంలేదు. వీటన్నింటికీ మించి గత ప్రభుత్వంలోని వైసీపీ నేతల నోటి మాటకే అధికారులు సర్వేలో ఎక్కువ విలువిచ్చారు. వారు తమ వారికి ఎంత పొలం ఉందంటే అంత రాసేశారు. డ్రోన్ కెమేరా చిత్రాలు, ఓఆర్ఐ మ్యాప్‌కు మ్యాచ్ కాక రిమార్క్ చూపినా వాటిని రిజెక్ట్ కొట్టేసి మరీ వారు అనుకున్న ప్రకారం సర్వే చేశామనిపించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 80 శాతం గ్రామాల్లో ఇదే తీరులో సర్వే జరిగిందనడానికి ప్రస్తుతం భూ వివాదాలకు సంబంధించి కోర్టులో ఈ రెండేళ్లలో పెరుగుతూ వచ్చిన కేసుల సంఖ్యే సాక్ష్యం.



గుంటూరులో ఓ వ్యక్తికి దస్తావేజులు, పాస్ పుస్తకాల ప్రకారం 1.30 ఎకరాల భూమి ఉంది. కానీ రీ సర్వే చేసి ఆయన పేరుపై 1.42 ఎకరాలు నమోదు చేశారు. మిగిలిన 12 సెంట్లు పక్క రైతు భూమి. ఇప్పుడు ఆ రైతు తనకు తెలియకుండా తన భూమిని మరొకరికి ఎలా రాసేస్తారంటూ అధికారులపై కేసు వేశారు.

తెనాలి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గత జగన్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీ సర్వే చేపడతామని, దశాబ్దాలుగా ఉన్న భూ వివాదాలను పరిష్కరిస్తామని.. దేశంలోనే ఇదొక గొప్ప పథకం అంటూ 2022 నవంబరులో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూ రక్ష ప్రవేశపెట్టింది. ఈ పథకంలో భాగంగా అధికారులు రీ సర్వే చేపట్టారు. అయితే రీ సర్వేతో భూ సమస్యలు తీరిపోతాయని, సరిహద్దుల గొడవలన్నీ పరిష్కారం అవుతాయని అప్పట్లో అందరూ భావించారు. అయితే వారి ఆలోచనలను తలకిందులు చేస్తూ ఉన్న సమస్యల పరిష్కారం కాదుకదా.. వాటి స్థానంలో కొత్త సమస్యలు పుట్టుకొచ్చాయి. అమ్మినవారికి, కొన్నవారికి, జాయింట్ ఖాతాలున్న వారికి మధ్య, కుటుంబాల్లోని అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల మధ్య కూడా ఈ సర్వేతో చిచ్చురేగింది. ఒకరిపై ఒకరు కోర్టులో కేసులు వేసుకునే వరకు రీ సర్వే చిచ్చు రేపింది. ఇన్ని సమస్యలు కేవలం రీ సర్వే సృష్టించినవే అయితే, వాటిని క్షేత్ర స్థాయిలో అప్పటికప్పుడు పరిష్కరించాలంటూ అప్పటి ప్రభుత్వం స్పెషల్ మొబైల్ మేజిస్ట్రేట్‌లను నియమించింది. వారేం చేస్తున్నారనేది కూడా అంతుబట్టని విషయమే.

అర్హత లేకున్నా రీ సర్వే కోసంగా ఉద్యోగోన్నతులు..


రీ సర్వేలో సమస్యలను రికార్డుల ఆధారంగా పరిశీలించి అప్పటికప్పుడు పరిష్కరించేందుకు అప్పటి ప్రభుత్వం కొందరు డిప్యూటీ తహసీల్దార్‌లను స్పెషల్ మొబైల్ మేజిస్ట్రేట్లుగా నియమించింది. అయితే డీటీగా ఉన్నవారిని ఈ పోస్టులకు పంపితే పర్వాలేదు. కానీ సీనియర్ అసిస్టెంట్లకు ఏ అర్హతా లేకుండానే వారికి ఉద్యోగోన్నతులు ఇచ్చేసి నియమించింది. సాధారణంగా సీనియర్ అసిస్టెంట్ డిప్యూటీ తహసీల్దార్ కావాలంటే డిపార్ట్‌మెంట్ పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాలి. కానీ అవేమీ లేకుండానే వారికి డీటీలుగా ఉద్యోగోన్నతి ఇచ్చేశారు. స్పెషల్ మొబైల్ మేజిస్ట్రేట్ హోదాలో రీ సర్వే కారణంగా వచ్చిన వివాదాలను పరిష్కరించిన దాఖలాలు ఏవైనా ఉన్నాయంటే వేళ్లపై లెక్కపెట్టడానికి కూడా దొరకవు. తహసీల్దార్‌లు, సబ్‌కలెక్టర్, కలెక్టర్ కార్యాలయాలనే బాధితులు ఆశ్రయించారు. చాలావరకు కోర్టులకు వెళ్లినవారూ ఉన్నారు.

- పథకం పేరు మార్చితే సరిపోదంటున్న బాధితులు
- రీ సర్వేతో ఉన్న సమస్యలు తోడైన సరికొత్త సమస్యలు
- రికార్డులను పరిశీలించకుండానే ఇష్టానుసారంగా సర్వే
- ఊరిలో లేకుంటే వారి భూములు మరొకరికి ధారాదత్తం
- సర్వే జరిగిన గ్రామాల్లో 90 శాతం కొత్త భూ సమస్యలే
- కార్యాలయాలు, కోర్టుల చుట్టూత బాధితుల ప్రదక్షిణలు

ప్రభుత్వం వివాదాల పరిష్కారం కోసమని ప్రత్యేక ప్రమోషన్‌లు ఇస్తే, వాటిని వారు పరిష్కరించకపోవడంతో కోర్టుల్లో కేసులు పెరిగి సమయం, కేసుల భారం ఎక్కువైపోయింది. అయితే ఈ ప్రత్యేక ఉత్తర్వులను అడ్డుపెట్టుకుని డీటీలుగానే అర్హత లేనివారు ఇప్పుడు ఏకంగా తహసీల్దార్ హోదాలో చలాయించేస్తున్నారు.

గత సర్వే రద్దు చేయాల్సిందేనా..

గత వైసీపీ ప్రభుత్వ కాలంలో జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం రీ సర్వేను రద్దు చేయాలనేది రైతులు, రైతు సంఘాల వాదన. సర్వే విషయంలో కనీస జాగ్రత్తలు, రికార్డుల పరిశీలన జరగలేదని, కేవలం అప్పటి నేతల సిఫార్సులు, సిబ్బంది నిర్లక్ష్యంతోనే జరిగిపోయిందనేది వారి వాదన. వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూ రక్ష పథకం లోపాల పుట్టగా మారిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం తాజాగా పేరును మార్చింది. ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్ట్‌గా పేరు మార్చుతూ ఈ నెల 17న ముఖ్య కార్యదర్శి పేరుతో జీవో విడుదల చేశారు. అయితే కేవలం పేరు మార్చితే సరిపోదని గత రీ సర్వేను రద్దు చేసి, తిరిగి వాస్తవ పరిస్థితుల ఆధారంగా జరపాలనేది రైతుల విన్నపం.



రీ సర్వే సమస్యల్లో కొన్ని ఉదాహరణలు..

- తెనాలి మండలం పినపాడులో ఓ వ్యక్తికి 4.3 ఎకరాల పొలం వంశపారంపర్యంగా వచ్చింది. రీ సర్వే నాటికి ఆయన చనిపోవడం, ఆయన నలుగురు సంతానంలో ఒక్కరు మాత్రమే స్వగ్రామంలో ఉన్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న ముగ్గురి పేరుపై ఒక్క సెంటు కూడాలేకుండా, మొత్తం విస్తీర్ణాన్ని స్థానికంగా ఉన్న వ్యక్తికే రాసేశారు. దీంతో మిగిలిన ముగ్గురు సోదరులు తమ భూ హక్కు కోసం కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. భూమి మొత్తం సొంతం చేసుకున్న వారి సోదరుడు తన బంధువుతో ఆ భూమికి సంబంధించి వివాదం ఉన్నట్లు కోర్టులో కేసు వేశారు. దీంతో రెవెన్యూ అధికారులు కూడా కోర్టులో కేసు ఉందనే కారణంతో దానిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా వదిలేశారు.
- రేపల్లెలో ఓ వ్యక్తి తనకున్న 1.80 ఎకరాల పొలంలో ఒక ఎకరం అమ్మేసి, తన పేరుపై మిగిలిన 80 సెంట్లు అట్టిపెట్టుకున్నారు. అయితే రీ సర్వేలో అమ్మిన భూమిని కూడా అతడికే సొంతమని నమోదు చేశారు. కొనుగోలు చేసిన వ్యక్తి రిజిస్ట్రేషన్ పత్రాలతో కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటే, అమ్మిన వ్యక్తి మాత్రం తాను తన పొలం ఎవరికీ అమ్మలేదని, అసలు రిజిస్ట్రేషనే చేయలేదని, తన భూమిని అన్యాక్రాంతం చేసేందుకు అధికారులతో కలసి కుట్రలు చేస్తున్నారంటూ అతడిపై కోర్టులో ఎదురు దావా వేయడం విశేషం.
- తెనాలి మండలం కఠెవరంలో 308 సర్వే నంబరు నుంచి భూమిని ఓ వ్యక్తి నుంచి ప్రభుత్వం దశాబ్దాల క్రితం కొనుగోలుచేసి పేదలకు పట్టాలిచ్చింది. అదే నంబరులో మరో 1.5 ఎకరాల భూమిని వారు ప్రభుత్వానికి అమ్మలేదు. 20 ఏళ్లుగా వారికిందే ఉన్న ఆ భూమికి సంబంధించి దస్తావేజులు, పాస్ పుస్తకాలు, అడంగల్ అన్నీ వారే ఆ భూమికి హక్కుదారులని చూపిస్తున్నది. అయితే వాటిని పట్టించుకోకుండా రీ సర్వే సిబ్బంది ఆ భూమిని కూడా ప్రభుత్వ భూమి కింద నమోదు చేశారు. ఇప్పుడు ఆ భూమిపై తనకు హక్కుందని తప్పును సరిదిద్ది, తన భూమిని తనకు అప్పగించాలని ఓ మహిళ ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ఆశ్రయించారు.
- తెనాలిలో 2.5 ఎకరాల భూమికి హక్కుదారు అంటూ రీ సర్వేలో ఆసిఫ్‌ఉన్నీసా అనే మహిళ పేరుపై నమోదు చేశారు. ఇక్కడ విశేషమేమంటే అసలు ఆ పేరున్న మహిళే అక్కడ లేరు. ఏ రికార్డులూ పరిశీలించకుండా, ఏ ఆధారాలు లేకుండా కొత్త పేరు ఎలా నమోదు చేశారనేది సర్వే సిబ్బంది నిర్లక్ష్యాన్ని, రీ సర్వే జరిపిన తీరును వేలెత్తి చూపిస్తుంది. ఆ భూమి అసలు హక్కుదారు తన భూమిని తన పేరుపై మార్చాలని ఆధారాలతో రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతూ లబోదిబోమంటున్నారు. ఇప్పుడు అసలు రైతు పేరుపై మార్చి రాయాలంటే, మొదట నమోదు చేసిన రైతుకు నోటీసులిచ్చి, ఆ భూమిపై తనకున్న హక్కును నిరూపించుకోలేని పక్షంలోనే పేరు మార్పు చెయ్యాలి. కానీ అసలు లేని రైతును ఎక్కడి నుంచి తీసుకురావాలో అధికారులకు అంతుపట్టని సమస్య.

స్వర్ణాంధ్ర - 2047 విజన్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

నరసరావుపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నీతి ఆయోగ్ రూపొందించిన స్వర్ణాంధ్ర-2047 విజన్ ముసాయిదా ప్రజల సూచనల కోసం ప్రదర్శించాలి. వాటి ద్వారా రానున్న 5 ఏళ్ల జిల్లా కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్ పీ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో అయన అధికారులతో సమీక్షించారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ ముసాయిదాకు అనుగుణంగా జిల్లా ,మండల స్థాయిలో కార్యాచరణ ప్రణాళికలు రూపకల్పన చేసే అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ముసాయిదా డాక్యుమెంట్ ఈనెల 21 నుండి అక్టోబర్ 5 వరకు ఐటీ శాఖ వెబ్‌సైట్‌లో ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు. ఈ ముసాయిదా డాక్యుమెంట్ పై ప్రజల నుండి సూచనలు సలహాలు తెలుసుకుని మండల స్థాయిలో యాక్షన్ ప్లాన్‌ను ఈ నెలాఖరు నాటికి సిద్ధం చేయాలని అదే విధంగా జిల్లా స్థాయిలో మండల స్థాయి అంశాలను పొందుపరుస్తూ అక్టోబర్ 15 నాటికి జిల్లా యాక్షన్ ప్లాన్ ను రూపొందించాలన్నారు. స్థానికంగా లభించే వనరులతో, విలువ ఆధారిత పారిశ్రామిక అభివృద్ధి, ప్రాథమికంగా వ్యవసాయ, పారిశ్రామిక సెక్టార్లు ఉద్యాన, ఆక్వా రంగం ఫుడ్ ప్రాసెసింగ్, సామాజిక అభివృద్ధి విద్య, ఉద్యోగాల కల్పన పారామీటర్లను పొందుపరుస్తూ జిల్లా యాక్షన్ ప్లాన్ రూపకల్పన చేయాలన్నారు. 5 ఏళ్ల కార్యాచరణ ప్రణాళికల తయారీని ప్రారంభించడం కోసం సీపీఓ ఇతర జిల్లా అధికారులకు మార్గ నిర్దేశం చేయాలని సూచించారు. ముసాయిదాపై నిర్దేశిత సమయాలలో పారిశ్రామిక వేత్తలు, విద్యావేత్తల సమావేశాలు నిర్వహించి వారి నుంచి సూచనలు సలహాలు అభి ప్రాయాలు సేకరించాలన్నారు అదేవిధంగా ఇన్చార్జ్ మంత్రుల ఆధ్వర్యంలో ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ఇతర ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి అభిప్రాయాలు సూచనలు సలహాలు సేకరించి క్రోడీకరించాలన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ ఇండస్ట్రియల్ ఛాంబర్ అసోసియేషన్‌లు, రైతు సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, ఆక్వా సంఘాలు నుంచి కూడా అభిప్రాయాలు సేకరించాలని, గ్రామ మండల, మున్సిపల్ స్థాయి సమావేశాలను నిర్వహించడం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా సమాచారం సేకరించాలన్నారు. జిల్లా అధికారులందరూ సీపీఓ సహకారంతో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాల న్నారు. తుది ముసాయిదా స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యు మెంట్‌ను సమీక్ష కోసం అక్టోబర్ 22న ముఖ్యమంత్రికి సమర్పించడం జరుగుతుందన్నారు. సమావేశంలో జేసీ సూరజ్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

- కుళాయిల పనులు వేగవంతం చేయండి
- ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టండి
- కలెక్టర్ అరుణ్‌బాబు



సమావేశంలో కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ సూరజ్

ఇంటింటికీ కుళాయి పనులు వేగవంతం చేయాలి

అమృత్ పథకం ద్వారా మున్సిపాలిటీల్లో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసే పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అమృత్ పథకంపై జరిగిన సమీక్షలో అయన మాట్లాడుతూ మొదటి విడతలో మంజూరైన రూ. 180 కోట్ల పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపులలో ఇబ్బందుల్ని పరిష్కరించాలన్నారు. రెండవ విడతకు సంబంధించి రూ. 258 కోట్ల పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఇప్పటివరకూ అమృత్ పథకం ద్వారా మంజూరైన పనులను పూర్తి చేయగలిగితే 8 మున్సిపాలిటీల్లోని దాదాపు 60,000 ఇళ్లకు కుళాయి ద్వారా నీరు అందించవచ్చన్నారు.

ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లాలో ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు సంబంధిత శాఖల అధికారులు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. హౌసింగ్ పరిధిలో పేదలకు ఇళ్లు కట్టించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాకు 7707 ఇళ్ల నిర్మాణం లక్ష్యం కాగా నిర్మాణాన్ని త్వరతగతిన పూర్తి చేయాలన్నారు. పీఎంఏవై అర్బన్, పీఎంఏవై గ్రామీణలో భాగంగా మొదలు కాని ఇళ్ల నిర్మాణాలను వెంటనే మొదలు పెట్టాలని, సంబంధిత మండల ప్రత్యేక అధికారులు, హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించాలని, నిర్మాణాలను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

ప్రారంభమైన ఇసుక సరఫరా

- యార్డు నుంచి కదలిన లారీలు
- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


మాదిపాడు స్టాక్ యార్డు నుంచి ఇసుక లోడింగ్

నరసరావుపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇసుక కష్టాలు తీరనున్నాయి. ఎట్టకేలకు ఇసుక సరఫరా శనివారం ప్రారంభమైంది. మాదిపాడు ఇసుక స్టాక్ యార్డు నుంచి లారీలు కదలాయి. ఇసుక కష్టాలు.. తీర్చేదెవరు..? శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వెలువడిన వార్తపై జిల్లా యంత్రాంగం స్పందించింది. మాదిపాడు స్టాక్ యార్డు నుంచి ఉచిత ఇసుక సరఫరాను ప్రారంభించారు. యార్డులో దాదాపు 25 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉన్నట్టు మైనింగ్ అధికారి నాగిని తెలిపారు. ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ఇసుక సరఫరా చేస్తున్నామన్నారు. తొలి రోజు 24 మంది ఇసుక ఆర్డర్ పొందారు. సాయంత్రానికి తొమ్మిది మందికి ఇసుక సరఫరా చేసినట్టు మైనింగ్ అధికారులు తెలిపారు. 419 మెట్రిక్ టన్నులు బుకింగ్ కాగా 165 టన్నులు సరఫరా చేశారు. ఇసుక కావాల్సిన వారు ఆన్‌లైన్ విధానంలో ఏపీ శాండ్ పోర్టల్‌లో బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు. ఆర్డర్ పొందిన వారికి వెనువెంటనే మాదిపాడు స్టాక్ పాయింట్ నుంచి ఇసుక సరఫరా చేస్తారు. వినియోగదారులు వారి అవసరం మేరకు ఇసుక బుక్ చేసుకునే అవకాశాన్ని మైనింగ్ శాఖ కల్పించింది. ఇసుక సరఫరా ప్రారంభం కావడంతో బ్లాక్‌లో ఇసుక ధరలు తగ్గే అవకాశాలున్నాయి.

సీబీఎస్ఈ శిక్షణ.. ఎస్ఎస్‌సీ పరీక్ష

5 వేల మంది విద్యార్థుల్లో అయోమయం



గుంటూరు(విద్య), సెప్టెంబరు 21: గత ప్రభుత్వం ఆర్భాటంగా అమలు చేసిన సీబీఎస్ఈ విధానం ఆ విద్యార్థుల పాలిట శాపంగా మారింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 5 వేల మంది విద్యార్థుల పరిస్థితి ప్రస్తుతం అగమ్యగోచరంగా మారింది. ఇంతకాలం వారు సీబీఎస్ఈలో చదువుకున్నారు. తీరా పరీక్షలు మాత్రం స్టేట్‌బోర్డు (ఎస్ఎస్‌సీ)లో రాయాల్సి వస్తోంది. ఈ ఏడాది ప్రభుత్వ బడుల్లోని సీబీఎస్ఈ పదో తరగతి విద్యార్థులకు స్టేట్‌బోర్డు ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించేలా విద్యాశాఖ సన్నద్ధం అవుతోంది. సరైన ప్రణాళిక, బోధన, ప్రమాణాలు పాటించక పోవడం.. ఉపాధ్యాయుల్లో కొరవడిన శిక్షణ వంటి అంశాలు సీబీఎస్ఈ విద్యార్థుల పాలిటి శాపంగా మారింది. దీంతో వారు సీబీఎస్ఈలో చదివినా ఈ ఏడాది పరీక్షలకు హాజరుకాలేని దుస్థితి నెలకొంది. ఇటీవల నిర్వహించిన అంతర్గత పరీక్షల్లో 65 శాతంపైగా విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. దీంతో సీబీఎస్ఈ పరీక్షలకు పంపకుండా వారిని స్టేట్‌బోర్డు పరీక్షలకు(ఎస్ఎస్‌సీ) పంపాలని నిర్ణయించారు. ఉమ్మడి జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వం దాదాపు 35కిపైగా పాఠశాలల్లో సీబీఎస్ఈ బోధన ప్రవేశ పెట్టింది. ఆయా పాఠశాలల్లో ప్రస్తుతం పదిలో ఉన్న విద్యార్థులు 5 వేల మంది ఉన్నారని సమాచారం. ఈ విద్యార్థులు మార్చి, ఏప్రిల్ మాసాల్లో సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) ఆధ్వర్యంలో జరిగే పరీక్షలు రాయాలి. అయితే విద్యార్థుల్ని ఆ దిశగా పరీక్షలకు సన్నద్ధం చేసిన దాఖలాలు దాదాపు శూన్యమనే చెప్పాలి. పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల్లో నైపుణ్యాలు పరిశీలించడానికి ఇటీవల పాఠశాల విద్యాశాఖ అంతర్గతంగా పరీక్షలు నిర్వహించింది. ఆంగ్లం, సైన్స్ సోషల్ స్టడీస్, గణితం విభాగాల్లో నిర్వహించిన పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ చూసి అధికారులు నివ్వెరపోయారు. 65 శాతం మంది విద్యార్థులు నైపుణ్య పరీక్షలో ఫెయిల్ అయ్యారు. ఈ విద్యార్థులను సీబీఎస్ఈ విధానంలో జరిగే పరీక్షలకు పంపితే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అధికారుల్లో ఆందోళన నెలకొంది. ఈ ఈక్రమంలో రాష్ట్ర స్థాయిలో జరిగే ఎస్ఎస్‌సీ పరీక్షలకు వారిని సన్నద్ధం చేయాలని అధికారులు నిర్ణయించారు.

పాత తెలుగా? కొత్త తెలుగా?

పరీక్షల విషయం ఇలా ఉంటే తెలుగు పేపర్ సమస్యగా మారనుంది. ప్రస్తుతం రాష్ట్ర పరీక్షలకు సిద్ధమయ్యేవారు కొత్త తెలుగు పుస్తకంతో పరీక్షలకు సన్నద్ధమవుతుండగా, సీబీఎస్ఈ వారు మాత్రం పాత తెలుగు టెస్టుబుక్‌తో పరీక్షలకు సిద్ధమయ్యారు. తాజాగా వీరంతా సెట్‌బోర్డు పరీక్షకు హాజరు కానున్న నేపథ్యంలో వారికి పాత తెలుగు పుస్తకం నుంచి ప్రశ్నాపత్రం ఇస్తారా? లేక కొత్త తెలుగు పాఠ్యపుస్తకం నుంచి ప్రశ్నాపత్రం ఇస్తారా అన్నది తేలాల్సి ఉంది.

ఏపీలో దేవర టికెట్ ధరలు పెంపు



జూనియర్ ఎన్టీఆర్ నటించిన పాన్ ఇండియా సినిమా 'దేవర' టిక్కెట్ల ధరలు పెంపు, స్పెషల్ షో లకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ నెల 27న విడుదల అవుతోన్న ఈ సినిమా మొదటి రోజు ఆరు షో లు.. అక్టోబరు 9వరకూ ఐదు షో ల చొప్పున రాష్ట్రంలో రిలీజైన అన్ని థియేటర్లలో ఆడించుకోవచ్చు. టిక్కెట్ ధరలు పెంచుకోవడానికి నిర్మాతల వినతిని పరిశీలించిన ప్రభుత్వం 60రూపాయల నుంచి 135రూపాయల వరకూ పెంచుకొనేందుకు అనుమతిచ్చింది. మొదటి రోజు అర్థరాత్రి 12గంటలకు బెనిఫిట్ షో, ఉదయం ఆరింటికే మార్నింగ్ షో నుంచే సినిమా ప్రదర్శనకు రాష్ట్ర ప్రభుత్వం నిర్మాతలకు అనుమతి ఇచ్చింది. విడుదలైన రెండో రోజు(28) నుంచి తొమ్మిది రోజుల పాటు ప్రతి రోజూ ఐదు షో లు ప్రదర్శించుకోవచ్చు. అక్టోబరు 6తర్వాత సాధారణ ప్రదర్శనలు ఉంటాయి.

వేధించడం మా విధానం కాదు : పవన్ కల్యాణ్



'రాజకీయాలకు అతీతంగా చిత్ర పరిశ్రమకు మేలు చేయాలనేదే చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విధానం. వైకాపా ప్రభుత్వం తరహాలో నిర్మాతలను, సినీ నటులను వేధించడం మా ప్రభుత్వ విధానం కాదు' అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఎన్టీఆర్ కథానాయకుడిగా నటించిన 'దేవర' చిత్రం ప్రత్యేక ప్రదర్శనలు, టికెట్ ధరల పెంపునకు ఏపీ ప్రభుత్వం అనుమతించిన నేపథ్యంలో సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్‌కు ధన్యవాదాలు తెలుపుతూ ఎన్టీఆర్, నిర్మాణ సంస్థ ఎన్టీఆర్ ఆర్ట్స్ బేనర్ ట్వీట్ చేసింది. దీనిపై పవన్‌కల్యాణ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. 'వైసీపీ పాలనలో సినీ ప్రముఖులు ఎన్ని కష్టాలు పడ్డారో నాకు తెలుసు. వ్యక్తులు, రాజకీయాలతో మాకు సంబంధం లేదు, పరిశ్రమను మేం గౌరవిస్తాం. మీ సినిమాకు మంచి జరగాలి' అని 'దేవర' యూనిట్‌కు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు.

\- అమరావతి (ఆంధ్రజ్యోతి)



వెంకీ షూటింగ్‌లో బాలయ్య

అగ్ర హీరోల షూటింగ్స్ ఒకేచోట జరుగుతున్నప్పుడు ఒక హీరో సెట్‌కు మరో హీరో వెళ్లడం, సరదాగా కాసేపు గడపడం, సినిమాల గురించి మాట్లాడుకోవడం గతంలో ఓ అలవాటుగా, సంప్రదాయంగా ఉండేది. హీరోల మధ్య ఐకమత్యానికీ, స్నేహబంధానికీ అటువంటి సంఘటనలు అద్దం పట్టేవి. చాలా రోజుల తర్వాత నందమూరి బాలకృష్ణ మళ్లీ ఆ సంప్రదాయాన్ని గుర్తుకు తెచ్చారు. వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో దిల్ రాజు నిర్మిస్తున్న తాజా చిత్రం షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతోంది. ఆ సమయంలో అక్కడే ఉన్న బాలకృష్ణ ఈ విషయం తెలుసుకుని వెంకటేశ్ షూటింగ్ స్పాట్‌కు వెళ్లి సందడి చేశారు. బాలయ్య, వెంకీ మంచి స్నేహితులు. అలాగే అనిల్ రావిపూడి బాలయ్యతో 'భగవంత్ కేసరి' చిత్రం రూపొందించారు. బాలయ్య రాకతో టీమ్ చాలా థ్రిల్ అయింది.



వరద బాధితుల సహాయార్థం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఎన్టీఆర్ తనయుడు, ఛాయాగ్రాహకుడు నందమూరి మోహనకృష్ణ, ఆయన కుమార్తె మోహన రూప శనివారం కలసి రూ. 25 లక్షల విరాళం చెక్కు అందజేశారు.

మా మధ్య అలాంటి సంబంధం లేదు



తన భార్య ఆర్తి రవికి విడాకులు ఇవ్వాలని తాను తీసుకున్న నిర్ణయాన్ని తన తల్లిదండ్రులు అంగీకరించారని, తన సంతోషమే వారికి ముఖ్యమని హీరో 'జయం' రవి స్పష్టం చేశారు. ఆయన నటించిన తాజా చిత్రం 'బ్రదర్' సినిమా ఆడియో విడుదల వేడుక శనివారం చెన్నైలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... "ఇంతకాలం ఇండస్ట్రీలో ఎలాంటి గాసిప్స్ లేకుండా జీవితాన్ని గడిపాను. ఇపుడు నాకు, పరాయి స్త్రీకి సంబంధం ఉన్నట్టు ప్రచారం చేస్తున్నారు. ఇది చాలా తప్పు. గాయని కెనీషాకు నాకు మధ్య ఎలాంటి సంబంధం లేదు. ఎంతోమందికి ఆమె ప్రాణం పోశారు. ఆర్తికి తెలియకుండా విడాకుల నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటన చేశారు. విడాకుల విషయంపై రెండు సార్లు నోటీసులు పంపించాను. ఇదే విషయంపై ఆర్తి తండ్రి వచ్చి నా తల్లిదండ్రులతో చర్చించారు. ఇంత జరిగినా తనకు తెలియకుండా తీసుకున్నట్టు చెప్పడం షాకింగ్‌కు గురిచేసింది. విడాకుల గురించి నా పెద్ద కుమారుడికి కూడా వివరించాను. అందరు పిల్లల్లాగే అతను కూడా మేమిద్దరం కలిసి వుండాలని కోరాడు. నా ఇద్దరు కుమారులు నా వద్దనే ఉంటున్నారు. ఇపుడు నేను కోరేది ఒక్కటే.. ప్రైవేట్ లైఫ్ ప్రైవేట్ లైఫ్‌గానే ఉండనివ్వండి. గాయని కెనీషా 600కు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. ఎంతోమంది ప్రాణాలు కాపాడారు. మేమిద్దరం ఒక హీలింగ్ సెంటర్‌ను నెలకొల్పి అనేక మందికి సాయం చేయాలని ప్లాన్ చేస్తున్నాం. దాన్ని పాడు చేయవద్దు. అనవసరంగా నా గురించి, కెనీషా గురించి చెడుగా మాట్లాడవద్దు' అని కోరారు.

\- చెన్నై(ఆంధ్రజ్యోతి)

రజనీ.. ఓ సుప్రీమ్ స్టార్



రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ 33 ఏళ్ల తర్వాత కలసి నటించిన సినిమా 'వేట్టయాన్'. తాజాగా ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమాన్ని చెన్నైలో నిర్వహించారు. ఈ సందర్భంగా అమితాబ్ బచ్చన్ గురించి రజనీకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ "ఒకానొక సమయంలో అమితాబ్ బచ్చన్ సినీ నిర్మాతగా భారీ ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయారు. తన దగ్గర పనిచేసే వాచ్‌మెన్‌కు కూడా జీతం ఇవ్వలేని పరిస్థితి. ఏం చేయాలో అర్థం కాక తనకు ఎంతో ఇష్టమైన జూహూ ఇంటిని వేలానికి పెట్టారు. అప్పుడు బాలీవుడ్ మొత్తం ఆయన్ను చూసి నవ్వింది. కానీ ఆ క్లిష్ట పరిస్థితుల నుంచి కోలుకుని.. మరో మూడేళ్లలో.. వరుస సినిమాలు..'కౌన్ బనేగా కరోడ్‌పతి' షోతో మళ్లీ నిలదొక్కుకున్నారు. జూహూలోని తన ఇంటితో పాటు మరో మూడు ఇళ్లను అమితాబ్ తిరిగి కొనుగోలు చేశారు" అని రజనీ చెప్పారు. ఈ వేడుకకు హాజరు కాలేకపోయినా.. అమితాబ్ ఓ వీడియో పంపి అభిమానులను ఖుషీ చేశారు. ఆ వీడియోలో అమితాబ్ మాట్లాడుతూ "ఇది నా తొలి తమిళ చిత్రం. రజనీకాంత్.. అందరిలో ఓ సుప్రీమ్ స్టార్. 1991లో రజనీ, నేను కలసి నటించిన చిత్రం 'హమ్'. ఇందులో రజనీ నా సోదరుడిగా నటించారు. షూటింగ్ విరామంలో నేను ఏ.సీ కార్‌లో విశ్రాంతి తీసుకునే సమయంలో.. రజనీ ఫిల్మ్ సెట్స్‌లో కింద పడుకునేవారు. ఈ చిన్న ఉదాహరణ చాలు ఆయన ఎంత సింపుల్‌గా ఉంటారో చెప్పడానికి" అని అన్నారు.

అమితాబ్ కోసం ప్రకాశ్‌రాజ్...

ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్ పాత్ర తమిళ్ వెర్షన్‌కు నటుడు ప్రకాశ్‌రాజ్ డబ్బింగ్ చెప్పడం విశేషం. సినిమాలో రజనీ ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా కనిపించనున్నారు. అమితాబ్, రజనీకి సీనియర్‌గా సత్యదేవ్ అనే పాత్రలో నటిస్తున్నారు. టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రం దసరా సందర్భంగా అక్టోబర్ 10న విడుదలవుతోంది.

రవికుమార్ చౌదరి ఫ్లాష్‌బ్యాక్ ఏమిటి?



'యజ్ఞం', 'పిల్లా నువ్వు లేని జీవితం' వంటి హిట్ చిత్రాలు అందించి, ఇటీవల రాజ్‌తరుణ్ నటించిన 'తిరగబడరా సామీ' తో మరో విజయం అందుకొన్న దర్శకుడు రవికుమార్ చౌదరి తన కొత్త చిత్రం వివరాలు వెల్లడించారు. 'ఫ్లాష్‌బ్యాక్' అనే ఆసక్తికరమైన టైటిల్‌తో ఈ సినిమా ఉంటుందని, న్యూ ఏజ్ లవ్‌స్టోరీగా రూపొందుతుందని ఆయన తెలిపారు. 'లేనిది ఎవరికి?' అనేది ట్యాగ్ లైన్. ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌కు రచన: డైమండ్ రత్నబాబు, పాటలు: సుద్దాల అశోక్ తేజ, వరంగల్ శ్రీను, సంగీతం: జేబీ, ఛాయాగ్రహణం: ప్రభాకరరెడ్డి, సమర్పణ: రిగ్వేద చౌదరి. నటీనటులు, ఇతర వివరాలను త్వరలో వెల్లడిస్తామని నిర్మాత కార్తీక్ రెడ్డి రాకాసి చెప్పారు.

రొమాంటిక్ కామెడీ డ్రామా



'హీరో' ఫేమ్ అశోక్ గల్లా, గౌరి ప్రియ జంటగా ఓ నూతన చిత్రంలో నటిస్తున్నారు. ఉద్భవ్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమాను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ "రొమాంటిక్ కామెడీ డ్రామాగా తెరకెక్కుతోన్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను త్వరలోనే మొదలెట్టనున్నాం. అందరినీ కడుపుబ్బా నవ్వించే ఈ చిత్రంలో గుండెలకు హత్తుకునే డ్రామా కూడా ఉంటుంది" అని చెప్పారు.

విజ్ఞప్తులు పరిశీలించి.. పరిష్కరిస్తా

• 34వ రోజు ప్రజాదర్బార్‌లో మంత్రి లోకేశ్ హామీ

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 21: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్ శనివారం 34వ రోజు తాడేపల్లిలోని ఉండవల్లి సీఎం నివాసం వద్ద జరిగింది. ఈ కార్యక్రమానికి మంగళగిరి నియోజకవర్గంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తరలివచ్చారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విన్నవించారు. ప్రతి ఒక్కరి విజ్ఞప్తిని పరిశీలించిన మంత్రి, పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కొన్ని సమస్యలపై అప్పటికప్పుడే సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

మంగళగిరి నియోజకవర్గం నుంచి..

మంగళగిరి మండలం నూతక్కికి చెందిన విజ్ఞాన విహార పాఠశాల ప్రతినిధులు మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. రేవేంద్రపాడు వద్ద బకింగ్ హామ్ కెనాల్‌పై శిథిలావస్థలో ఉన్న పురాతన వంతెనను పునర్నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. రేవేంద్రపాడు వంతెనపై వేలాది మంది ప్రజలు, రైతులు, పాఠశాలల, కళాశాలల విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారని శిథిలావస్థలో ఉన్న వంతెనపై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి స్పందిస్తూ వంతెన పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని, అదేవిధంగా నియోజకవర్గ వ్యాప్తం అండర్ గ్రౌండ్ డ్రైయినేజి పనులను త్వరలోనే మొదలు పెడతామని హామీ ఇచ్చారు. ఆత్మకూరు గ్రామంలో తాతా సాంబశివరావు ఇంటి వద్ద నుంచి ఆర్సీఎం చర్చి వరకు ఉన్న మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా నిర్మించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా సమితి, గ్రామస్థులు విన్నవించారు. ఇంజినీరింగ్ చదివిన తనకు ఉద్యోగ అవకాశం కల్పించాలని చినకాకానికి చెందిన వి.కౌశిక్, వి.కోమలి మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో ఎన్నిమార్లు దరఖాస్తు చేసినా వితంతు పెన్షన్ మంజూరు చేయలేదనీ, పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన ఎం.శివనాగమణి విజ్ఞప్తి చేశారు. పరిటాలలోని ఎంవీఆర్ ఇంజినీరింగ్ కాలేజిలో ఎంబీయే చదివిన తనకు గత ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించని కారణంగా సర్టిఫికెట్లు కాలేజిలో నిలిచిపోయాయని తన సర్టిఫికెట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని తాడేపల్లికి చెందిన జి.ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.



ముస్లిం సోదరీమణుల సమస్యలు వింటూ..



దివ్యాంగురాలి బాబును పలకరిస్తున్న లోకేశ్

రాష్ట్ర వ్యాప్తంగా విజ్ఞప్తులు

విజయవాడ విద్యాధరపురంలో నివాసం ఉండే తాము ఇటీవల సంభవించిన వరదలకు ఇంట్లోకి నీరు చేరడంతో బంధువుల ఇంటిలో తలదాచుకున్నామని, నష్టపరిహారం అంచనా కోసం అధికారులు వచ్చిన సమయంలో ఇంటిలో లేమని, తమ కుటుంబానికి కూడా నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని షేక్ మలికాబేగం విజ్ఞప్తి చేశారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో క్యాజువల్ లేబర్‌లుగా 8 నెలల నుంచి పని చేస్తున్న తమను అర్థాంతరంగా విధుల నుంచి తొలగించాలని కార్మికులు మంత్రికి ఫిర్యాదు చేశారు. ఇసుక సరఫరాలో లారీ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కాకినాడకు చెందిన శ్రీలక్ష్మి శ్రీనివాస క్వారీ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. లారీ కిరాయిపై జీఎస్టీ రద్దుతోపాటు సెక్యూరిటీ డిపాజిట్టును రద్దు చేయాలని కోరారు. ఇసుక సరఫరా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా చేసేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గుంటూరు జిల్లా డీఎంహెచ్‌వో పరిధిలో వివిధ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో పని చేస్తున్న డీఈవోలు, ఎల్జీఎస్‌లకు 2023 నవంబర్ నుంచి నిలిచిపోయిన జీతం బకాయిల విడుదలకు చర్యలు తీసుకోవాలని సిబ్బంది విజ్ఞప్తి చేశారు. అనారోగ్యంతో బాధ పడుతున్న తన భార్యకు సీఎంఆర్ఎఫ్ ద్వారా వైద్యసాయం అందించి ఆదుకోవాలని విశాఖ జిల్లా యలమంచిలి నియోజకవర్గం అప్పారాయుడుపాలెంకు చెందిన కణితి మురళీకృష్ణ విజ్ఞప్తి చేశారు. వైసీపీకి చెందిన కొంతమంది వ్యక్తులు తమ మల్బరీ షెడ్‌ను తగులబెట్టడంతో భారీగా నష్టపోయామని విచారించి తగిన న్యాయం చేయాలని కర్నూలు జిల్లా కొత్తపల్లికి చెందిన వల్లిగి సుధాకర్ విజ్ఞప్తి చేశారు. అన్ని విజ్ఞప్తులు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి నారా లోకేశ్ ప్రజలకు హామీ ఇచ్చారు.

ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణకు ఘన స్వాగతం

• తెనాలిలో భారీ ర్యాలీ

తెనాలి అర్బన్, సెప్టెంబరు 21 : ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగకు తెనాలిలో శనివారం ఘన స్వాగతం లభించింది. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీంకోర్టు సానుకూలంగా ప్రకటించడంతో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తెనాలిలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి విచ్చేసిన కృష్ణమాదిగకు మాదిగ సామాజికవర్గం భారీ ఎత్తున స్వాగతం పలికింది. వీఎస్ఆర్ అండ్ ఎన్వీఆర్ కళాశాల నుంచి మార్కెట్ యార్డు వరకు ర్యాలీగా తీసుకు వచ్చారు. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు ర్యాలీలో భారీ ఎత్తున పాల్గొనడంతో సభా స్థలికి చేరుకోవడానికి మూడు గంటలు పైగా సమయం పట్టింది. గుంటూరు- తెనాలి మార్గంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. రాత్రి 10.30కు సభాస్థలికి చేరుకున్న ఆయనకు పలు గ్రామాల నుంచి వచ్చిన ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బోకేలతో సత్కరించారు. ఐఆర్ఎస్ అధికారి పులిపాక ఆనందరావు ఆధ్వర్యంలో సమ్మేళనానికి ఏర్పాట్లు చేశారు. జిల్లా, రాష్ట్ర ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో అభివాదం చేస్తున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ

గ్రీన్ గ్రేస్ నిర్మాణ పనులు నిలిపివేయాలి

• ప్లాన్ కాపీలో షార్ట్ ఫాల్స్ ఉన్నాయి
• జూలైలోనే పనుల నిలుపుదలకు నోటీసులు జారీ
• జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు (కార్పొరేషన్), సెప్టెంబరు 21: గుంటూరు నగరం పట్టాభిపురం మెయిన్ రోడ్డులో జరుగుతున్న గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్ నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. వివిధ మీడియా సంస్థల కథనాలు, ఫిర్యాదులపై నగరంలోని గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్ నిర్మాణ పనులను పట్టణ ప్రణాళిక అధికారులతో కలిసి శనివారం పరిశీలించామని చెప్పారు. వారు పొందిన అనుమతి, జరుగుతున్న పనులను ప్రత్యక్షంగా తనిఖీ చేశామని వివరించారు. జీఎంసీ అధికారులు ఇచ్చిన షార్ట్ ఫాల్స్ పూర్తి చేసే వరకూ నిర్మాణ పనులను పూర్తిగా నిలిపివేయాలని ఈ ఏడాది జూలైలోనే ఇచ్చిన నోటీసు మేరకు నిర్మాణదారులు పనులు నిలిపివేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు.

కొలతలతో తనిఖీ..

అపార్టుమెంట్ నిర్మాణానికి తీసుకున్న అనుమతులు, జరుగుతున్న నిర్మాణ పనులను తొలుత కమిషనర్ మ్యాప్ ద్వారా పరిశీలించారు. మీడియా కథనాల్లో వచ్చిన అంశాలపై అధికారులు, బిల్డర్లను అడిగి తెలుసుకొని స్వయంగా కొలతలు ద్వారా తనిఖీ చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ గ్రీన్ గ్రేస్ నిర్మాణం 2015లో ప్రారంభమైందనీ, తర్వాత మేనేజ్‌మెంట్ మారడం, నిర్దేశిత డాక్యుమెంట్లు జత చేయకపోవడంపై జీఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులు షార్ట్ ఫాల్స్ నోటీసులు ఇచ్చారన్నారు. 2024 జూలైలో షార్ట్ ఫాల్స్ క్లియర్ చేసే వరకు నిర్మాణ పనులు నిలిపి వేయాలని ఫైనల్ నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. మీడియాలో కథనాలు వచ్చిన వెంటనే పట్టణ ప్రణాళికాధికారులను పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. నగరపాలక సంస్థ నుంచి భవన నిర్మాణానికి తీసుకున్న అనుమతులు, జరుగుతున్న నిర్మాణ పనులను అధికారుల నివేదిక ఆధారంగా క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. పట్టణ ప్రణాళిక అధికారుల నివేదిక, తమ తనిఖీలో గమనించిన అంశాల ఆధారంగా చట్టపరంగా ఏమైనా అతిక్రమణలు జరిగాయా అని పరిశీలిస్తామన్నారు. పర్యటనలో సిటీ ప్లానర్ రాంబాబు, డిప్యూటీ సిటీ ప్లానర్ మహా పాత్రో, ఏసీపీ మురళి, టీపీఎస్ రిజ్వాన, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



గ్రీన్ గ్రేస్ అపార్టుమెంట్ ప్లాన్ కాపీని పరిశీలిస్తున్న జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు

టీటీడీ లడ్డూ వివాదంపై సీబీఐ విచారణ కోరాలి

గుంటూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ తయారీలో గత పాలక మండలి జంతువుల కొవ్వు, చేపనూనె వంటివి వినియోగించినట్లుగా వచ్చిన ల్యాబ్ రిపోర్టులపై సీబీఐ విచారణను రాష్ట్ర ప్రభుత్వం కోరాలని ధార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బాధ్యులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని కోరారు. దేవుడు సొమ్మును అప్పనంగా దోచుకున్న టీటీడీ బోర్డు సభ్యులు, ప్రభుత్వాధినేతలను కఠినంగా శిక్షించి రాజకీయ నాయకులు, ప్రభుత్వాలకు కనువిప్పు కలిగించాలన్నారు. తిరుమల లడ్డూని అపవిత్రం చేశారని వచ్చిన ఆరోపణలపై కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వర స్వామి వారి భక్తుల మనోభావాలు దెబ్బతిన్న కారణంగా హిందూ ధార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, వెంకటేశ్వర స్వామి భక్త బృందం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం గుంటూరు నగరంలోని శంకర్‌విలాస్ సెంటర్‌లో శాంతియుత నిరసన కార్యక్రమం జరిగింది. నాలుగు అడుగుల వెంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి శాస్త్రోక్తంగా వేద పండితులతో వెంకటేశ్వర స్వామి వారికి అష్టోత్తర శతనామావళి పూజాదికాలు, హారతి నైవేద్య, కైంకర్యాలు నిర్వహించారు. నిరసన ప్రదర్శనకు సిరిపురపు శ్రీధర్ శర్మ, వనమా నరేంద్ర, జంధ్యాల రామలింగేశ్వర శాస్త్రి, దాసరి రాము, వావిలాల కుమార్ తదితరులు నేతృత్వం వహించారు. దేశంలో ఉన్న దేవాలయాలపై రాజకీయ నాయకుల జోక్యం లేకుండా, వారి కబంధ హస్తాల్లో నుంచి దేవాలయాలను బయటకు తెచ్చే విధంగా కేంద్రంలో ఉన్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పార్లమెంట్లో బిల్లు ప్రవేశపెట్టి చట్టం తీసుకురావాలని కోరారు. ఏపీ ముఖ్య కార్యదర్శిగా పనిచేసిన ఎల్వీ సుబ్రహ్మణ్యం ఇచ్చిన జీవో ఆధారంగా దేవాలయాల్లో అన్యమత ఉద్యోగస్తుల్ని తొలగించి వేరే ప్రభుత్వ సంస్థల్లోకి తరలించాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎండపల్లి శబరి, పెద్దింటి చైతన్య కృష్ణ, చిలుమూరు ఫని, షేక్ బాజీ, వడ్డమాను ప్రసాద్, కూరపాటి కిషోర్, ఐలూరి శ్రీనివాసు, వేదాంతం హరినాథ్, సంజీవ్, వడ్లమూడి రాజా, కొప్పర్తి సీతారమేష్, ఫమ్మిడిగంటం రమణయ్య, వెలగలేటి గంగాధర్, బొడ్డుపల్లి శ్రీనివాస్, నారాయణరెడ్డి, నల్లపనేని అమర్నాథ్, ఎన్జీవో అసోసియేషన్ మూర్తి, గుండు జ్ఞానేశ్వర్, పట్టాభిరాముడు, రాజ్ కుమార్, ఆంజనేయులు, అన్నా లక్ష్మి, లీల, చెరక కుమార్ గౌడ్, తుమ్మెద కొమ్మిన నరేష్, రాజేష్, మునిపల్లి తేజ, బాలు, వంశీ, గుత్తికొండ శ్రీనివాస్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌విలాస్ సెంటర్‌లో జరిగిన ఆధ్యాత్మిక నిరసన ప్రదర్శనలో ధార్మిక సంఘాల నాయకులు

రోడ్డుపై బైఠాయించి నిరసన

గుంటూరు, సెప్టెంబరు 21: టీటీడీ పవిత్రను మంట గలిపిన ఆ ముగ్గురుపై సీబీఐతో విచారణ జరిపించాలని హిందూ ధార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం గుంటూరు నగరంలోని శంకర్ విలాస్ సెంటర్‌లో జిల్లాలో ఉన్న అన్ని హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. నాటి దేవస్థానం ఈవో ధర్మారెడ్డి, చైర్మన్ సుబ్బారెడ్డి, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై సీబీఐతో విచారణ జరపాలని ఆయా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. హిందూ దేవాలయాల ధర్మ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు దర్శనపు శ్రీనివాస్ మాట్లాడుతూ క్రైస్తవుడైన జగన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో రాష్ట్రంలోని అన్ని హిందూ దేవాలయాలకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. కాంచిభట్ల హర్షవర్ధన్, శివశక్తి ఉత్తరాంధ్ర సమన్వయకర్త పి.లక్ష్మీ రామానుజ దాసి, యువమోర్చా నాయకులు యశ్వంత్, జనసేన నాయకులు కొండూరి కిషోర్, విద్యార్థి సంఘ, హిందూ సంఘం నేతలు పాల్గొన్నారు.

మాచర్ల మున్సిపల్ కమిషనర్‌గా వేణుబాబు

గుంటూరు (కార్పొరేషన్), సెప్టెంబరు 21 : మాచర్ల మున్సిపల్ కమిషనర్‌గా ధూళిపాళ్ల వేణుబాబును నియమించారు. ప్రస్తుతం ఆయన గుంటూరు కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్నారు.


జీఎంసీ అదనపు కమిషనర్‌గా ఓబులేశు

గుంటూరు (కార్పొరేషన్), సెప్టెంబరు 21 : నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా సి.ఓబులేశును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీవో నంబరు 723ను విడుదల చేసింది. ప్రస్తుతం అదనపు కమిషనర్‌గా ఉన్న రాజ్యలక్ష్మిని బదిలీ చేస్తూ ఆమె స్థానంలో ఓబులేశ్‌ను నియమించారు.

యువకుడు దుర్మరణం

మేడికొండూరు సెప్టెంబరు 21: ఎదురుగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్ కింద పడి యువకుడు దుర్మరణం పాలైన సంఘటన మండలంలోని పేరేచర్ల ఫ్లైఓవర్ పక్కన సర్వీసు రోడ్డులో శనివారం జరిగింది. ఫిరంగిపురం మండలం నుదురుపాడు గ్రామానికి చెందిన మండలనేని లక్ష్మీ నాగ సురేంద్ర (20) తన గ్రామం నుంచి మోటార్ సైకిల్‌పై గుంటూరు వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్ ఢీకొంది. దీంతో సురేంద్ర ట్యాంకర్ కిందకు పడిపోగా ఆయనపై వెనుక టైరు ఎక్కడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న మేడికొండూరు రక్షక్ పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు ట్యాంకర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

అతివేగం ప్రాణం తీసింది...



శ్రీవల్లి (ఫైల్ ఫొటో)

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): అతివేగం ఓ మహిళ ప్రాణం తీయగా..మరో ఇద్దరిని తీవ్ర గాయాలపాలు చేసింది. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...గుంటూరు జిల్లా, బ్రహ్మణ కోడూరుకు చెందిన సొపాటి శ్రీవల్లీ(23) గత కొంత కాలంగా నగరంలోని ఈసీఐఎల్‌లో ఉంటూ స్థానిక యోధ డైగ్నస్టిక్ సెంటర్‌లో రిసెప్షనిస్టుగా పని చేస్తుంది. కాగా గురువారం ఆమెకు సన్నిహితులైనా నేరేడ్‌మెట్‌కు చెందిన కారు డ్రైవర్ శివ(28), దమ్మాయిగూడకు చెందిన అనిల్(25)తో కలిసి కారులో గుంటూరు లోని తన తండ్రి కోటేశ్వరరావు వద్దకు వెళ్లింది. పని ముగించుకుని శుక్రవారం అదే కారులో వారు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అయ్యారు. వీరు ప్రయాణిస్తున్న కారు పెద్దఅంబర్‌పేట్ ఔటర్ రింగురోడ్డు మీదుగా ఘట్‌కేసర్ వైపుకు వెళ్తుంది. అతి వేగంతో వెళ్తున్న కారు తారామతిపేట గ్రామ సమీపం వద్దకు రాగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి అవతలి రోడ్డుపై బోల్తా పడింది. కారులో నుంచి శ్రీవల్లీతో పాటు అందులో ఉన్న ఇద్దరు రోడ్డుపై పడ్డారు. శ్రీవల్లీ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. శివ, అనిత్‌కు తీవ్ర గాయాలకు కావడంతో గాంధీ ఆసుపత్రికి తరలించారు.

ఎస్వీఎన్ కాలనీలో భారీ చోరీ

• 50 సవర్ల బంగారు ఆభరణాలు, రూ. లక్షా 70 వేల నగదు అపహరణ



చోరీ జరిగిన ఇంటిలో పరిశీలిస్తున్న పట్టాభిపురం సీఐ వీరేంద్ర, ఎస్సై మధుపవన్

గుంటూరు, సెప్టెంబరు 21: స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్వీఎన్ కాలనీ ఏడో లైన్‌లో పట్టపగలే భారీ చోరీ జరిగింది. తాళం వేసిన ఇంటిని దొంగలు లూటీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్.వి.ఎన్. కాలనీ ఏడో లైనుకు చెందిన ఎం.వీ.శంకర్ చిట్‌ఫండ్స్‌తోపాటు ఫైనాన్సు వ్యాపారం చేస్తుంటారు. శనివారం ఉదయం ఆయన బయటికి వెళ్లారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో భార్య పద్మావతి ఎన్జీవో కాలనీలోని బంధువుల ఇంటికి వెళ్లారు. వారికి మంచానికే పరిమితమైన దివ్యాంగుడైన కుమారుడు ఉన్నారు. మధ్యాహ్నం పద్మావతి బయటకు వెళ్లే సమయంలో కుమారుడికి టాబ్లెట్ వేసి వెళ్లారు. ఆమె తిరిగి నాలుగు గంటలకు ఇంటికి వచ్చేసరికి చోరీ జరిగింది. ఇంటి ముందు సీసీ కెమెరాలతోపాటు చిన్న కుక్క పిల్లల తల్లి కూడా అక్కడే ఉంటుంది. అయితే దొంగలు వెనుక వైపు నుంచి లోనికి ప్రవేశించారు. వెనకవైపు వంటగది తలుపును గట్టిగా నెట్టడంతో బోల్టు ఊడింది. లోనికి ప్రవేసించిన దొంగలు బీరువా తాళాలు డ్రెస్సింగ్ టేబుల్‌లో ఉంచడంతో అవి తీసుకొని బీరువాని తీసి అందులో ఉన్న 50 సవర్ల బంగారు ఆభరణాలు, లక్షా 70 వేల నగదు అపహరించారు. పట్టపగలు భారీ చోరీ జరగడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. బాధితుడు శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. సమాచారం అందుకున్న పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు, ఎస్సై మధుపవన్, సీసీఎస్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చుట్టుపక్కల ఇల్లు, ప్రదేశాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, సెప్టెంబరు 21: నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం శనివారం నాటికి 589.80 అడుగులు ఉంది. ఇది 311.44 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,120 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 4,287 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,136 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 44,943 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 46,943 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 21: ప్రాజెక్టులో శనివారం 42.00 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 29,928 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 33,640 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు. దీనిలో 16వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా, మిగిలినవి ఒక గేటు ద్వారా విడుదల అవుతున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

• విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 • నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	121, 129,140
చికెన్ విత్ స్కిన్	228.00
చికెన్ స్కిన్ లెస్	238.00



కాట్రపాడులో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని, ఎమ్మెల్సీ జంగా

ప్రసాదాన్ని కలుషితం చేసిన జగన్‌రెడ్డి రాజకీయాల్లో ఉండకూడదు

● ఇది మంచి ప్రభుత్వంలో యరపతినేని

దాచేపల్లి, సెప్టెంబరు 21: టీటీడీ లడ్డును కలుషితం చేసిన వైసీపీ నేత జగన్మోహన్‌రెడ్డి రాజకీయాల్లో వుండకూడదని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో దాచేపల్లి మండలంలోని కాట్రపాడు, భట్రుపాలెం గ్రామాలలో ఎమ్మెల్యే ఎంఎల్‌సి జంగా కృష్ణమూర్తితో కలిసి పాల్గొన్నారు. తొలుత భట్రుపాలెంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాట్రపాడు ఆలయంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో యరపతినేని మాట్లాడుతూ పవిత్రత కలిగిన ఆలయంలో స్వామివారి లడ్డుప్రసాదంలో జంతువులకు సంబంధించిన నూనెను వాడటం భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. ఇంతటి దుర్మార్గవ్యక్తి రాజకీయాలలో అవసరమా? అంటూ ప్రశ్నించారు. దసరా పండుగ నుండి ఉచిత గ్యాస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రవేశపెట్టనున్నారని తెలిపారు. గురజాల నియోజకవర్గాన్ని శాంతియుతంగా నిలిపి అభివృద్ధే ధ్యేయంగా ఎన్‌డీయే ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు అండగా నిలబడుతూ మెగా డీఎస్సీ నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతినెల 1వ తేదీన ఉద్యోగులకు జీతాలు అందజేస్తున్నారన్నారు. రూ.1674.47కోట్ల ధాన్యం కొనుగోలు బకాయిలు చెల్లించి అన్నదాతను ఆదుకున్నామన్నారు. రూ.1452కోట్లు ఇచ్చి పంచాయతీలకు ప్రాణం పోశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను ప్రారంభించామన్నారు. ల్యాండ్‌టైటిలింగ్ యాక్ట్‌ను రద్దుచేశామన్నారు. ఎంఎల్‌సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రజలను పట్టించుకోని పాలకులకు ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. అనంతరం గ్రామస్తుల నుండి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని యరపతినేని హామీ ఇచ్చారు. కాట్రపాడు, భట్రుపాలెం గ్రామాలలో ఎమ్మెల్యే యరపతినేని, ఎంఎల్సి జంగాలకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో తంగెళ్ల శ్రీనివాసరావు, బెల్లంకొండ భద్రి, వేముల వినోద్‌రెడ్డి, పగడాల భాస్కరరావు, అక్కినపల్లి బాలయ్య, కొప్పుల గిరి, మునగా నిమ్మయ్య, వేముల తిరుమలకుమార్, డాక్టర్ విక్రాంత్, సొసైటీ నారాయణ, నెల్లూరి రామకోటయ్య, పురంశెట్టి పరంజ్యోతి, మామిడి చంద్రశేఖరరావు, చింతపల్లి హసన్ అహ్మద్, కూరాకుల నాగేశ్వరరావు, నర్రా పుల్లయ్య, అంబటి శేషగిరిరావు, బత్తుల నాగేశ్వరరావు, కోరె రామారావు పాల్గొన్నారు.

● పిడుగురాళ్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు.. ఇది మంచి ప్రభుత్వంపై పట్టణ, గ్రామాలలో కూటమి నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శనివారం పట్టణ, రూరల్ పరిధిలో కూటమి నేతలు ఇంటింటికి వెళ్లి చంద్రబాబు అధికారంలోకి వచ్చాక 100 రోజుల పాలనపై సాధించిన విజయాలతో స్టిక్కర్‌ను అంటించారు. జానపాడులో వున్నం సురేష్, ముప్పాళ్ల సాంబయ్య, చెన్నాయపాలెంలో మండల కన్వీనర్ గండికోట వెంకటేశ్వర్లు, చినఅగ్రహారంలో మేకల రాంబాబు, పట్టణంలో పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, సాంబశివరావు, సయ్యద్ అమీర్‌అలి, కొమ్మినేని రామచంద్రరావు, ఎల్‌విఆర్, మందా డేవిడ్, జొన్నలగడ్డ శ్రీను, బొల్లా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

● మాచవరం: మాచవరంలో శనివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది ఇంటింటికి తిరిగి కరపత్రాలు, స్టిక్కర్లు అందజేశారు. వంద రోజుల పరిపాలన కాలంలో ప్రభుత్వం చేపట్టిన వివిధ రకాల సంక్షేమ పథకాల గురించి వివరించారు. రానున్న రోజుల్లో కూడా చేపట్టబోయే సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో నరసరావుపేట పార్లమెంటరీ నియోజక వర్గ కార్యనిర్వాహక కార్యదర్శి ఎడ్లపల్లి రామారావు, మాజీ డీసీ ఛైర్మన్ పుసులూరి రామయ్య, ఎలిశెట్టి నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి గౌసియా, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



మొక్కపాడులో కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ఎన్నికల హామీలన్నీ నెరవేర్చి తీరుతాం

● ఎమ్మెల్యే కన్నా

రాజుపాలెం, సెప్టెంబరు 21: ఎన్నికల హామీలన్నీ నెరవేర్చి తీరుతామని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చెప్పారు. శనివారం మండలంలోని మొక్కపాడులో ఎమ్మెల్యే, పార్టీ నాయకులు, అధికారులు ఇంటింటికి తిరుగుతూ ఇది మంచి ప్రభుత్వం కరపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీసీ కాలనీలో రూ.10లక్షలతో వేయనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా కన్నా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వందరోజుల్లో ప్రజలకు చేసిన మంచిని ఈ నెల 26వరకు ప్రతి ఇంటికి తిరిగి తెలియజేస్తామన్నారు. సీఎం చంద్రబాబు అనుభవం, విజన్ ఉన్న నాయకుడన్నారు. ఎన్నికల హామీలో భాగంగా అన్న క్యాంటీన్లను ప్రారంభించామన్నారు. ల్యాండ్ టైటిలింగ్‌యాక్ట్‌ని రద్దు చేశామన్నారు. దీపావళి నుండి ఉచిత సిలిండర్ల పథకం అమలవుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కణదం పద్మశ్రీను, నియోజకవర్గ పరిశీలకులు తాతా జయప్రకాష్‌నారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, జనసేన మండలాధ్యక్షుడు తోట నరసయ్య, టీడీపీ జిల్లా అధికారప్రతినిధి పూజల వెంకటకోటయ్య, మాజీ ఎంపీపీ గుత్తా వెంకట్రావు, డాక్టర్ వడ్డెంపూడి పవన్‌కుమార్, మాజీ జడ్పీటీసీ మర్రి వెంకట్రామిరెడ్డి, తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు చిన్నబోయిన రాఘవరావుయాదవ్, అంకాళ్ల ప్రభుదాసు, అంచుల నరసింహరావు, వర్ల శ్రీను, షేక్ అల్లాబక్షు, కణదం వెంకట్రావు తదితరులు ఉన్నారు.

చదువు ద్వారానే అభివృద్ధి సాధ్యం

సత్తెనపల్లి, సెప్టెంబరు 21: చదువు ద్వారానే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. అనంతరం విద్యార్థులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చదువు ద్వారా సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. పాఠశాలలోని సమస్యలను పరిష్కరిస్తానని కన్నా తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు మేలు చేసే మంచి ప్రభుత్వం..

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 21: అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేది కూటమి ప్రభుత్వమేనని టీడీపీ నాయకులు, గుంటూరు నగర మాజీ మేయర్ కన్నా నాగరాజు అన్నారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన పూర్తయిన సందర్భంగా మండలంలోని పాకాలపాడులో శనివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ఇంటింటికి వెళ్ళి ఈ ప్రభుత్వ పాలనలో జరిగిన సంక్షేమాన్ని వివరించారు. కార్యక్రమంలో మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు కొనికినేని సత్యనారాయణ, పార్టీ నాయకులు నన్నె సాహెబ్, కోమటినేని శ్రీనివాసరావు, కొఠారు పరబ్రహ్మప్రసాదు, కొఠారు పూర్ణచంద్రరరావు, బక్కా వీరయ్య, మక్కపాటి రవిచంద్ర, వక్కంటి అంజయ్, సదనం హరి, మార్కెట్ రాజు, చెన్నమల్లు మోహన్‌బాబు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే జూలకంటి

కారంపూడి, సెప్టెంబరు 21: స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవాల్లో భాగంగా శనివారం కారంపూడిలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రారంభించి పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో పంగులూరి అంజయ్య, ఉన్నం లక్ష్మీనారాయణ, కర్ల సైదారావు, కొండలు, మాజీ ఎంపీపీ నాగులనాయక్, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, సత్యప్రసాద్, మండల కోఆర్డినేటర్ కూరాకుల సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి కసిన్యానాయక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పేటసన్నిగండ్లలో ప్రత్యేకాధికారి, జిల్లా డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ ఆధ్వర్యాన స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు. చింతపల్లి, ఒప్పిచర్ల గ్రామాల్లో ఈవోపీఆర్డీ సత్యప్రసాద్ ఆధ్వర్యాన మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, చపిడి రాము, ఎంపీటీసీ పూర్ణయ్య, సర్పంచ్ పుష్పావతి, పంచాయతీ కార్యదర్శి భూతేశ్వరరెడ్డి, రామరాజు, బోర్నేడి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పీఆర్కే సలహాదారుడిని బలవంతంగా తీసుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు

● రెండు గంటల అనంతరం క్షేమంగా ఇంటికి

మాచర్లటౌన్, సెప్టెంబరు 21: మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సలహాదారుడు, వైసీపీ నేతల్లో ముఖ్య నేతగా చెప్పుకునే న్యాయవాది ఎం శ్రీనివాసశర్మను గుర్తుతెలియని వ్యక్తులు శనివారం సాయంత్రం 5:30గంటల సమయంలో 13వ వార్డులో ఆయన ఇంటినుంచి బలవంతంగా తీసుకెళ్లినట్లు తెలిసింది. 2 గంటల తరువాత శ్రీనివాసశర్మ ఇంటికి చేరుకున్నారు. ఈలోగా ఇంటి వద్ద కొంత ఉద్రిక్తత నెలకొంది. శ్రీనివాసశర్మను ఎవరు తీసుకెళ్లారు.. ఎందుకు తీసుకెళ్లారు అనే దానిపై పోలీసులు విచారణ చేపట్టారు. శ్రీనివాసశర్మ సైతం తనను ఎవరు తీసుకెళ్లారు అనే దానిపై మీడియాకు తెలిపేందుకు నిరాకరించారు.

23వ తేదీ లోపు పంట నమోదు చేసుకోవాలి

పెదకూరపాడు, సెప్టెంబరు 21: ఈనెల 23వ తేదీ లోపు రైతులు ఈ పంట నమోదు చేసుకోవాలని మండల ఏవో శాంతి శనివారం తెలిపారు. రైతులు రైతు సేవా కేంద్రం పెదకూరపాడు-2లో పంట నమోదు చేసుకోవాలని కోరారు. పొలం పాసు పుస్తకం, ఆధార్ కార్డు నకలు తీసుకురావాలని ఆమె వివరించారు.

23న పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

మండలంలోని పారిశుధ్య కార్మికులకు ఈనెల 23వ తేదీన పెదకూరపాడులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ విద్య శనివారం తెలిపారు. పారిశుధ్య కార్మికులు ఈ అవకాశాన్ని ఉపయోగించు కోవాలని ఆమె కోరారు.

బీసీ రిజర్వేషన్‌ల ఆమోదంపై హర్షం..

బెల్లంకొండ, సెప్టెంబరు 21: రాష్ట్రంలో బీసీలకు 33శాతం రాజకీయ రిజర్వేషన్ కల్పిస్తూ ఏపీ క్యాబినెట్ నిర్ణయం తీసుకోవటంపై నరసరావుపేట పార్లమెంట్ బీసీ ప్రధానకార్యదర్శి ఓర్సు ఆనంద్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం చంద్రాజుపాలెంలో బీసీ నాయకులతో సమావేశం ఏర్పాటుచేశారు. సమావేశంలో మండల ప్రధానకార్యదర్శి రామకృష్ణ, శ్రీనివాసరావు, గుడిసె కొండయ్య చావలి రామకృష్ణ, శ్రీరామ్‌మూర్తి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

క్రోసూరు రైతు సేవా కేంద్రంలో ఈ క్రాపు నమోదు

క్రోసూరు, సెప్టెంబరు 21: క్రోసూరు రైతు సేవా కేంద్రంలో మండల ఏవో వీ వేణుగోపాల్ శనివారం ఈ క్రాపు, ఈకేవైసీ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. రైతుల నుంచి వివరాలు సేకరించి వేలిముద్రలు వేయించి ఈ క్రాపు నమోదును పర్యవేక్షించారు. ఈ క్రాపు, ఈకేవైసీ నమోదుకు 23వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందన్నారు. ఈ క్రాపులో నమోదు చేసుకోకపోతే ప్రభుత్వ ప్రయోజనాలు, ఆర్థిక సంస్థల నుంచి రుణాలు పొందే అవకాశం ఉండదని ఏవో తెలిపారు.

ఆటల పోటీల ప్రారంభం

మాచర్లటౌన్, సెప్టెంబరు 21: శనివారం పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీలో జడ్పీ బాలురోన్నత పాఠశాలలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఆటలపోటీలను ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, టీడీపీ నేతలు యెనుముల కేశవరెడ్డి, కజ్జం సైదయ్య, వజ్రం నాయక్, మద్దిగపు చిన వెంకట్రామిరెడ్డి, రామా టాకీస్ జానీ, నాగూర్‌బాషా, మంజుల అంజి, ఎంపీడీవో సరోజినిదేవి, ఎంఈవో అల్లి సురేష్, హెచ్‌ఎం రామారావు, జనసేన నేతలు తదితరులు పాల్గొన్నారు.

మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మాచర్లటౌన్, సెప్టెంబరు 21: వాసవీక్లబ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యాన ఓరుగంటి సైదమ్మ జ్ఞాపకార్థం ఈనెల 22వ తేదీన పట్టణంలోని నిర్వహించనున్న మెగా ఉచిత కంటి వైద్య శిబిరం కరపత్రాన్ని శనివారం ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ఆవిష్కరించారు. ఈ శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్ 9849065882ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు, ఎంపీడీవో సరోజినిదేవి, టీడీపీ నేతలు, మేడం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సొంతింటి కలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం

● 2014-19 మధ్యకాలంలో నిలిచిన ఇంటి బిల్లులకు త్వరలో మోక్షం



ఆదర్శనగర్‌లో గృహాలను పరిశీలిస్తున్న హౌసింగ్ అధికారులు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 21: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కల నెరవేర్చే దిశగా అడుగులు వేస్తున్నది. 2014-19 మధ్య కాలంలో ఇళ్లు మంజూరై వివిధ దశల్లో ఆగిపోయిన పక్కాగృహాల నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం బిల్లులు అందించేందుకు నిర్ణయించింది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బిల్లులను మంజూరు చేయకపోవడంతో గురజాల నియోజకవర్గంలో 2,200 గృహాలకు పైగా పాత బిల్లులకు మోక్షం కలగకపోవడంతో నిరాశ చెందారు. దాచేపల్లి మండలంలో 745 ఇళ్లు, గురజాల మండలంలో 313, మాచవరం మండలంలో 395, పిడుగురాళ్ల మండలంలో 383 గృహాలు వివిధ దశల్లో 2019 లోపు నిర్మాణాలు ఆగిపోయాయి. ఆ తరువాత నిర్మాణదారులే సొంత వ్యయం భరించి 4 మండలాల్లో కలిపి 882 గృహాలను పూర్తి చేసుకున్నారు. గృహనిర్మాణాలు పూర్తిచేసుకున్న వారిలో కొందరికి ఒక బిల్లు రావాల్సి వుండగా, మరికొందరికి రూఫ్ లెవల్, స్లాబు లెవల్ బిల్లులు జమకావాల్సి వుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2014-19 మధ్యకాలంలో వివిధ దశల్లో నిర్మాణాలు నిలిచిన వాటిని అధికారులు పరిశీలించి ఆన్‌లైన్‌లో ఇంటి వివరాలను నమోదు చేయాలని ఆదేశించడంతో వారంరోజులుగా గురజాల నియోజకవర్గంలోని గృహనిర్మాణశాఖ అధికారులు నిర్మాణాల వద్దకు వెళ్లి క్షేత్రస్థాయిలో ఆన్‌లైన్‌లో ఫొటోలు నమోదు చేస్తున్నారు.

టీడీపీ లీగల్ సెల్ న్యాయవాదుల ఫిర్యాదు

సత్తెనపల్లి, సెప్టెంబరు 21: వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీలో ప్రసాదం తయారీలో జరిగిన అవకతవకల మీద, సహకరించిన వారిపై చట్టపరంగా విచారించి చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ లీగల్ సెల్ న్యాయవాదులు శనివారం డీఎస్పీ హనుమంతరావు ఫిర్యాదుచేశారు. అప్పటి టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డితో పాటు వీరందరికీ మద్దతుగా నిలిచిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పట్టణ ఎస్‌ఐ సంధ్యారాణికి కూడా ఫిర్యాదుచేశారు. వారిలో టీడీపీకి చెందిన లీగల్ సెల్ న్యాయవాదులు మద్దినేని వెంకటచలపతిరావు, అనుమోలు జయరామ్, దివ్వెల శ్రీనివాసరావు, కల్లం వీరబాస్కరరెడ్డి, పూదోట రాజు, ఆర్ వెంకటేశ్వరరావు, బీజేపీ నేత చలువాది చిన సత్యనారాయణ ఉన్నారు.

సీఎం సహాయ నిధికి విరాళం

సత్తెనపల్లి, సెప్టెంబరు 21: హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎస్‌ఆర్‌డీజీ పాఠశాల విద్యార్థులు రూ.25వేల విరాళాన్ని శనివా రం సీఎం సహాయనిధికి అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎం రాధారాణి, ఫౌండేషన్ అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన నాగేశ్వరరావు అంత్యక్రియలు

సత్తెనపల్లి, సెప్టెంబరు 21: ప్రజా కళామండలి రాష్ట్ర కోశాధికారి ఉన్నవ నాగేశ్వరరావు అంత్యక్రియలు శనివారం వడ్డవల్లిలోని శ్మశానవాటికలో జరిగాయి. ముందుగా ప్రజామండలి కళాకారులు, పౌరహక్కుల సంఘం నేతలు, ప్రజా సంఘాల నాయకులు నాగేశ్వరరావు మృతదేహాన్ని ట్రాక్టర్‌పై పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. అంతిమయాత్ర నిర్వహించిన అనంతరం వడ్డవల్లి శ్మశానవాటికలో నాగేశ్వరరావు అంత్యక్రియలను నిర్వహించారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర నాయకుడు చిలకా చంద్రశేఖర్, విరసం రాష్ట్ర నాయకులు ఖాశిం, సీఆర్ ప్రసాదు, కేవీపీఎస్ నాయకులు కృష్ణ, ప్రజాతంత్ర ఉద్యమం నాయకులు వెంకటేశ్వరరావు, రామారావు, ఏడుకొండలు, వివిధ సంఘాల నాయకులు ప్రభాకర్, డీజే పాల్, వేదాద్రి, కంబాల శ్రీనివాస్, రామారావు, రామకృష్ణ, అబ్రహం, శ్రీనివాసరావు, అభిమానులు పాల్గొన్నారు.

ఇన్‌సర్వీస్ కోటాలో సీట్లు నష్టపోతున్న డాక్టర్లు

● ఫణిదం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రదీప్

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 21: ఇన్‌సర్వీస్ కోటలో డాక్టర్లు సీట్లు నష్టపోతున్నారని ఫణిదం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ అన్నారు. శనివారం నరసరావుపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో జీవో 85 రద్దుచేయాలని కోరుతూ నల్లరిబ్బన్లు ధరించి మౌనదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ జీవో 85ని ప్రభుత్వం జూలై 20న పీజీ ఇన్‌సర్వీస్ కోటాకు సంబంధించి విడుదల చేశారన్నారు. ఈ జీవో ద్వారా క్లినికల్ బ్రాంచ్‌లు 30శాతం ఉన్న సీట్లు 15శాతానికి తగ్గించారని, నాన్‌క్లినికల్ బ్రాంచ్‌లకు ఉన్న 50శాతం ఉన్న సీట్లును 30శాతంకు తగ్గించారన్నారు. దీనివల్ల దాదాపు 250 సీట్లు ఇన్‌సర్వీస్ కోటాలో డాక్టర్లు నష్టపోతున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యంచేయడానికి డాక్టర్లకు ఇన్‌సర్వీస్‌లో పీజీ చేసుకొని సేవలు అందించడానికి అవకాశం లేకుండా పోతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్ వెంకటరమణ, పల్నాడు జిల్లావ్యాప్తంగా పీహెచ్‌సీలలో పనిచేస్తున్న మెడికల్ ఆఫీసర్‌లు పాల్గొన్నారు.

పాత కక్షల నేపథ్యంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 21: పాతకక్షల నేపథ్యంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఐదుగురికి గాయాలైన సంఘటన మండలంలోని కొమెరపూడిలో శుక్రవారం రాత్రి జరిగింది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని ఒకే సామాజికవర్గానికి చెందిన వైసీపీ, టీడీపీ వారికి పాతకక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తమ పార్టీ కార్యకర్త సోదరి ఇంటికి వెళ్తుండగా టీడీపీ వారు దాడి చేశారని వైసీపీవారు చెపుతుండగా, వైసీపీ వారే దారికాచి తమపై దాడిచేశారని టీడీపీ వారు చెపుతున్నారు. వివాదం ఘర్షణగా మారి ఒకరిపై ఒకరు కర్రలతో దాడిచేసుకోగా ఐదుగురికి తలలు పగిలి గాయాలయ్యాయి. వైసీపీకి చెందిన మహ్మద్ నూర్‌హసన్ ఫిర్యాదుపై టీడీపీకి చెందిన ఏడుగురిపై, టీడీపీకి చెందిన మందులపాలెం షేక్ మహమ్మద్ మీరా ఫిర్యాదు మేరకు వైసీపీకి చెందిన 8మందిపై కేసు నమోదుచేసినట్టు రూరల్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు.



ఏరియా వైద్యశాలలోని ఐసీటీసీ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న అధికారి

ఐసీటీసీ సెంటర్ తనిఖీ

సత్తెనపల్లి, సెప్టెంబరు 21: పట్టణంలోని ఏరియా వైద్యశాలలో ఉన్న ఐసీటీసీ సెంటర్‌ను గుంటూరు, ప్రకాశం జిల్లాల ఐసీటీసీ, నెట్‌బ్యాంక్, ఏఆర్‌టీ సెంటర్ల టెక్నికల్ అధికారి వీవీఎస్ పవన్‌కుమార్ శనివారం తనిఖీచేశారు. రికార్డులను పరిశీలించారు. హెచ్‌ఐవీ ఎయిడ్స్ బాధితులకు అందుతున్న సేవలను పరిశీలించారు. సెంటర్ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

కారంపూడి, సెప్టెంబరు 21: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మంచిపాలన అందిస్తోందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం కారంపూడిలోని మండల పరిషత్ కార్యాలయంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు పలు సంక్షేమ పథకాలతో కూటమి ప్రభుత్వం ప్రజలచే ఇది మంచి ప్రభుత్వం అనిపించుకుందన్నారు. పెన్షన్‌ల పెంపు, అన్న క్యాంటీన్ల ఏర్పాటు, మెగా డీఎస్సీ ల్యాండ్ టైట్లింగ్‌యాక్ట్ రద్దు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు సాగుతుందన్నారు. మాచర్ల మండలం రాయవరం జంక్షన్ నుంచి నకరేకల్లు అడ్డరోడ్డు వరకు నూతన తారురోడ్డును మంజూరు చేయించామన్నారు. కారంపూడి మండలంలోని 15 పంచాయతీల పరిధిలో రూ.2.35కోట్ల నిధులతో సీసీ రోడ్లు మంజూరు చేయించామన్నారు. టెండర్ల ప్రక్రియ జరుగుతుందన్నారు. తిరుపతి లడ్డులో కల్తీ నూనె వినియోగిస్తే అధికార యంత్రాంగం కనిపెట్టలేకపోవడం దురదృష్టకరమన్నారు. ఇంతటి పాపానికి ఒడిగట్టిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ముందుగా పట్టణంలోని ఇందిరాగాంధీ బొమ్మ సెంటర్లో ఇంటింటికి తిరిగి ప్రజలకు కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, పంగులూరి అంజయ్య, పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, మండల మాజీ అధ్యక్షుడు చప్పిడి రాము, బొర్నేడి శ్రీను, కోటేశ్వరరావు, పంగులూరి పుల్లయ్య, కర్నా సైదారావు, తండా మస్తాన్‌జాని, పలిశెట్టి రాఘవ, షేక్ మోదీన్‌సా, బాలునాయక్, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు ఎస్‌పీఆర్ కృష్ణ, మాజీ ఎంపీపీ నాగుల్‌నాయక్, గోళ్ల సురేష్, బత్తుల రాముడు, కాల్వ పేరయ్య, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, గాడిపర్తి పూర్ణయ్య, మునుగోటి సత్యం, వజ్రాల నరసింహారెడ్డి, బీజేపీ నేతలు శెట్టి హనుమంతురావు, జనసేన నేత రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

విజయపురిసౌత్‌లో ఇది మంచి ప్రభుత్వం...

మాచర్ల రూరల్, సెప్టెంబరు 21: కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా మండలంలోని విజయపురిసౌత్‌లో శనివారం టీడీపీ నేతలు, సచివాలయ సిబ్బంది ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ వంద రోజులపాలనపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ విజయపురి సౌత్ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, ఎరుపల్లి వెంకటేశ్వర్లు, మైలపల్లి అప్పలరాజు, తోటకూర పరమేశ్వరరావు, గంటా ధనుంజయరావు, సీహెచ్ అప్పలరాజు, రాంచంద్, కొర్లయ్య, పంచాయతీ రాజ్ ఏఈ సత్యనారాయణ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

పట్లవీడులో...

వెల్దుర్తి, సెప్టెంబరు 21: మండలంలోని పట్లవీడులో శనివారం కూటమి నేతలు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి వంద రోజుల ప్రభుత్వపాలనపై ప్రజలకు వివరించి కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో కూటమి నేతలు బీసీ కొండలు, అక్కిరెడ్డి, బత్తుల ముసలయ్య, లింగయ్య యాదవ్, గుండెబోయిన కొండలు యాదవ్, రామిరెడ్డి, లింగారావు, రఫి తదితరులు పాల్గొన్నారు.

నేడు జమ్మలమడకలో ..

మాచర్లటౌన్: మండలంలోని జమ్మలమడకలో ఆదివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సరోజినిదేవి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆమె అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. అధికారులు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం వందరోజుల పాలనపై ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబుపై నమ్మకంతోనే కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



ఉంగుటూరులో ప్రసంగిస్తున్న ఎంఎల్‌ఏ భాష్యం ప్రవీణ్

అమరావతి, సెప్టెంబరు 21: రాష్ట్రంలో సీఎం చంద్రబాబునాయుడుపై నమ్మకంతో మంచి ప్రభుత్వానికి ప్రజలు పట్టంకట్టారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. శనివారం మండలంలోని ఉంగుటూరు, లింగాపురం గ్రామాలలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జరిగిన ప్రజావేదికలో ప్రసంగించారు. రెండు గ్రామాలలో పార్టీ శ్రేణులు, ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా నెమలికల్లు-ముండెపూడి రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం సీసీ రోడ్‌కు శంకుస్థాపన చేశారు. రెండు గ్రామాలలో జరిగిన సభలలో ప్రవీణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజులలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. ప్రజావేదికల ద్వారా అధికారులను గ్రామాలకు తెచ్చి ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో ప్రతి మండలంలో వారానికి ఒకరోజు అందుబాటులో ఉండి ప్రజాసమస్యలు పరిష్కరిస్తామన్నారు. పెదకూరపాడు నియోజకవర్గాన్ని ఓ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబునాయుడు ప్రణాళిక సిద్ధం చేయమని చెప్పారన్నారు. అధికారులు ప్రజాసమస్యలు పరిష్కారంలో ప్రలోభాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఉంగుటూరులో గత ప్రభుత్వంలో చేసిన అరాచకాలకు బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటానన్నారు. ప్రజావేదిక సభలకు ఎంపీడీవో ఉమాదేవి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు నల్లపాటి రాము, ఎంపీపీ ఎం హనుమంతరావు, సంగం డెయిరీ డైరెక్టర్ వలివేటి ధర్మారావు, జాస్తి వీరాంజనేయులు, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, సర్పంచ్ మేదరమెట్ల అనూరాధ సోమశేఖర్, లింగాపురం సర్పంచ్ కె.సుధారాణి, ఎన్ మల్లేశ్వరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



నాగిరెడ్డిపాలెంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

హామీలు నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదే

మండల కోర్ కమిటీ సభ్యుడు వెన్నా

బెల్లంకొండ, సెప్టెంబరు 21: ఎన్నికల హామీలను నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని బెల్లంకొండ మండల టీడీపీ కోర్ కమిటీ సభ్యుడు వెన్నా సీతారామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని నాగిరెడ్డిపాలెంలో ఇంటింటికి తిరిగి వందరోజుల కూటమి ప్రభుత్వం నెరవేర్చిన హామీల గురించి ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపాలెం మాజీ ఎంపీటీసీ తిప్పిరెడ్డి కిచ్చారెడ్డి, సుబ్బారెడ్డి, చావలి రామకృష్ణ, బద్దూరి బుల్‌రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడువాయి గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం...

అచ్చంపేట, సెప్టెంబరు 21: మండలంలోని తాడువాయి గ్రామంలో శనివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ కార్యక్రమాలను వివరించారు. పింఛన్‌లు, నిరుద్యోగులకు అండగా మెగా డీఎస్సీ, అన్న క్యాంటీన్‌లు, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు తదితర వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో వీఆర్‌వో ఆదిలక్ష్మి, ఏఎన్‌ఎం నరసమ్మ, గ్రామ కార్యదర్శి గోపీ, అనుమోలు వెంకటేశ్వరరావు, పల్లెలపాటి శ్రీనివాసరావు, అనుమోలు రమేష్, ఎస్‌కే నాగుల్‌మీరా, ఏపూరి రమేష్, అంజనేయులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడులో..

పెదకూరపాడు, సెప్టెంబరు 21: కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజుల్లో రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని తెలుగు రైతు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పరుచూరి పూర్ణచంద్రరావు అన్నారు. మండలంలోని బుచ్చయ్యపాలెంలో శనివారం మన మంచి ప్రభుత్వం గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రకాష్, టీడీపీ నేతలు ఉన్నారు.

కోలగుట్లలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం

దుర్గి, సెప్టెంబరు 21: మండలంలోని కోలగుట్లలో శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం అక్టోబర్ 2వరకు జరుగుతుందని స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ బెంజిమెన్ తెలిపారు. కార్యక్రమంలో రమేష్, శంకరరావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

● మాచర్ల రూరల్: మండలంలోని తాళ్లపల్లిలో శనివారం సర్పంచ్ పసుపులేటి బ్రహ్మానాయుడు ఆధ్వర్యాన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ వెంకటరామయ్య, సంఘ మిత్ర రీచార్జ్ ట్రైనింగ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ మేనేజర్ ఎం కోటేశ్వరరావు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంచేలా బోధన చేయాలి



దేచవరం మోడల్ స్కూల్‌లో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీవైఈవో వేణుగోపాలరావు

నకరికల్లు, సెప్టెంబరు 21: విద్యార్థుల సామర్థ్యాలను పెంచేలా బోధన సాగాలని డీవైఈవో కే వేణుగోపాలరావు ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం ఆయన దేచవరం మోడల్ స్కూల్‌ను తనిఖీచేశారు. 9వ తరగతి, ఇంటర్ విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వేళాంగినిపాల్గొన్నారు.

పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిపై దాడి

గురజాలటౌన్, సెప్టెంబరు 21: పాతకక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై దాడి జరిగిన సంఘటన మండలంలోని తేలుకుట్లలో శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తేలుకుట్లకి చెందిన చల్లా నాగరాజుపై అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కర్రలతో దాడిచేశారు. నాగరాజును కుటుంబసభ్యులు గురజాలలోని ప్రభుత్వవైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

బొర్రాపై చర్యలు తీసుకోవాలి

నకరికల్లు, సెప్టెంబరు 21: తన భార్య మృతికి కారకులైన వారితో పాటు, జనసేన సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బొర్రా వెంకట అప్పారావుపై కూడా చర్యలు తీసుకోవాలని జనసేన నకరికల్లు మండల ప్రధానకార్యదర్శి ఉప్పు కోటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. 8 నెలల క్రితం జనసేన మండల అధ్యక్షురాలైన తాడువాయి లక్ష్మి ద్వారా బొర్రా వెంకటఅప్పారావు తమకు రూ.లక్ష సాయం చేశారన్నారు. ఆ తర్వాత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన అప్పారావు మద్దతు ఇవ్వాలని లేదంటే నగదు ఇవ్వాలని తమను ఇబ్బంది పెట్టారన్నారు. ఈ క్రమంలో వారి వేధింపులకు మనస్తాపంతో తన భార్య ఆత్మహత్య చేసుకుందన్నారు. అప్పటినుంచి లక్ష్మి అజ్ఞాతంలోకి వెళ్లిపోగా ఆమెను అరెస్టు చేయకుండా అప్పారావు అడ్డుకుంటున్నారని కోటేశ్వరరావు తెలిపారు. ఈ క్రమంలో పవన్‌కళ్యాణ్ తనకు న్యాయం చేయాలని చేయాలని, భార్య మృతికి కారకులైన తాడువాయి లక్ష్మిని, ఆమెను కాపాడుతున్న వెంకటఅప్పారావుపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కోటేశ్వరరావు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని బొర్రా వెంకట అప్పారావు మరో ప్రకటనలో తెలిపారు. తాడువాయి లక్ష్మి ఆధ్వర్యంలో ఇదంతా జరిగిందని, తాను సాయం చేయటమే తప్ప ఇందులో తన ప్రమేయం లేదన్నారు.

రాజకీయ పార్టీల నేతలతో సమావేశం

సత్తెనపల్లి, సెప్టెంబరు 21: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శనివారం ఆర్డీవో మురళీకృష్ణ అధ్యక్షతన ఓటర్లజాబితా స్వచ్ఛీకరణపై రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. బీఎల్‌వోల డోర్ టూ డోర్ పరిశీలన పూర్తైందన్నారు. పోలింగ్‌స్టేషన్‌ల రేషనలైజేషన్ విషయంపై చర్చించారు. రాజకీయపార్టీల నాయకులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో మునిసిపల్ కమిషనర్ షమ్మి, తహసీల్దార్లు చక్రవర్తి, పుల్లారావు, భవానీశంకర్, వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

నరసరావుపేట కమిషనర్‌గా జస్వంత్‌రావు

నరసరావుపేట, సెప్టెంబరు 21: నరసరావుపేట మున్సిపల్ కమిషనర్‌గా ఎం జస్వంత్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ కమిషనర్‌గా ఉన్న సీ రవిచంద్రారెడ్డిని మాతృ సంస్థకు బదిలీ చేశారు. ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్‌గా చేస్తూ ఇటీవల బదిలీ అయ్యారు. కొంతకాలం ఆయన పోస్టింగ్ కోసం వేచి ఉన్నారు. కార్పొరేషన్ కమిషనర్‌గా ఎక్కడా ఖాళీ లేకపోవడంతో సొంత జీతం నిబంధనల మేర జస్వంత్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. గతంలో రేపల్లె వినుకొండ, తెనాలి కమిషనర్‌గా జస్వంత్ పనిచేశారు. ఇద్దరు ప్రజా ప్రతినిధుల సిఫార్సు మేరకు జస్వంత్‌ను నరసరావుపేటకు నియమించనట్టు సమాచారం. నరసరావుపేట కమిషనర్‌గా దాదాపు ఐదుగురు అధికారులు ఆశించారు. వీరికి ప్రజా ప్రతినిధులు సిఫార్సు లేఖలు కూడా ఇచ్చారు. దీంతో కమిషనర్ నియమాకంపై నెలకొన్న ఉత్కంఠకు జస్వంత్ నియమాకంతో తెరదింపినట్లయింది.



వేల్పూరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న జడ్పీటీసీ హైమావతి

పేదల సంక్షేమమే లక్ష్యంగా కూటమి పాలన

● జడ్పీటీసీ హైమావతి

శావల్యాపురం, సెప్టెంబరు 21: పేదల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి వందరోజుల పాలన కొనసాగిందని జడ్పీటీసీ పారా హైమావతి అన్నారు. మండలంలోని వేల్పూరు, వెలమావారిపాలెం, కొత్తలూరు, కనమర్లపూడి, కారుమంచి గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు అధికారులు పాల్గొని గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి 100రోజుల కూటమి పాలనను ప్రజలకు వివరించి కరపత్రాలు అందజేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు, కొత్తలూరు ఉపసర్పంచ్ గుంటూరు సాంబశివరావు మాట్లాడుతూ పించన్ల పెంపు, మెగా డీఎస్సీ ప్రకటన, ల్యాండ్ టైటిలింగ్‌యాక్ట్ రద్దు, అన్న క్యాంటిన్‌ల పునరుద్ధరణ హామీలను కూటమి ప్రభుత్వం 100రోజుల్లోనే నెరవేర్చి ఇది మంచి ప్రభుత్వమని ప్రజలందరి మన్ననలు పొందిందన్నారు. సీనియర్ నాయకులు యరమాసు కోటేశ్వరరావు, గోపాళం శివ ప్రసాద్, కోటా హరిబాబు, బొల్లా పేరయ్య, దొడ్డా ఏడుకొండలు, గోరింట్ల హనుమంతరావు, బోడెపూడి శంకర్, ముక్కపాటి నాగేశ్వరరావు, కాసరగడ్డ వెంకటరత్నం, పూరేటి నరసింహారావు, తిరువీధి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఇది మంచి ప్రభుత్వం'పై ఇంటింటి ప్రచారం



20వ వార్డులో ప్రచారంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

చిలకలూరిపేట, సెప్టెంబరు 21: దిగ్విజయంగా వంద రోజులు కూటమి పాలనను పూర్తి చేసుకుని ఇది మంచి ప్రభుత్వం అనిపించుకున్న సందర్భంగా స్థానిక 20వ వార్డులో టీడీపీ నాయకులు ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ సమద్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, 20వ వార్డు టీడీపీ అధ్యక్షుడు గుప్తా, ప్రధాన కార్యదర్శి సుభాని, పార్టీ సీనియర్ నాయకులు షేక్ కరీముల్లా, తేళ్ల సుబ్బారావు, ఎస్ఎస్ సుభాని, మురకొండ మల్లిబాబు, కొండా వీరయ్య ,కొత్త కోటేశ్వరరావు, ముల్లా కరీముల్లా, అమరా రమాదేవి పాల్గొన్నారు. కట్టుబడి వారిపాలెం, యడవల్లి గ్రామాల్లో మండల అధ్యక్షుడు జవ్వాజి మదన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

జిల్లాలో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం

● పీడీ జోసెఫ్‌కుమార్

రొంపిచర్ల, సెప్టెంబరు 21: పల్నాడు జిల్లాలో సిమెంట్ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్ తెలిపారు. శనివారం రొంపిచర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బీటీ రోడ్లు, వివిధ రకాల షెడ్ల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు. మండలానికి 25 షెడ్లు మంజూరు చేశా మన్నారు. జిల్లాలో ఏడువందల షెడ్లకు గాను 550 మంజూర య్యాయన్నారు. సేద్యపు నీటి కుంటలు, నీటి స్టోరేజ్ ట్యాంకులు, చెరువులు తవ్వటం, కొండలపై నుంచి వచ్చే నీరు వృథా కాకుండా భూమిలోకి ఇంకేలా చేయటం వంటి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. జిల్లాలో రెండు వందల సేద్యపు నీటి కుంటలు మంజూరైనట్టు తెలిపారు. ఉద్యాన పంటలను 1500 ఎకరాల్లో చేపడుతున్నామన్నారు. మొక్కలు పెంపకాన్ని కూడా చేపట్టనున్నట్టు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఎంపీడీవో మాథ్యూబాబు, ఏపీవో ప్రసాదు పాల్గొన్నారు.

సాహితీ సంస్కర్త గురజాడ : పీవీ సుబ్బారావు

యడ్లపాడు, సెప్టెంబరు 21: సమాజంలోని రుగ్మతలను ఎత్తి చూపుతూ సంఘ సంస్కరణ జరగాలన్న దృష్టితో రచనలు చేసిన గొప్ప సాహితీవేత్త, సంస్కర్త గురజాడ అప్పారావు అని విశ్రాంత అధ్యాపకుడు, ప్రముఖ సాహితీ విమర్శకుడు పీవీ సుబ్బారావు అన్నారు. యడ్లపాడులోని నారాయణ ఇంగ్లిషు మీడియం పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు జయంతి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గురజాడ రాసిన కన్యాశుల్కం నాటకం ప్రపంచ వ్యాప్తమైందన్నారు. ఆయన రచనలు సమాజాన్ని ఎంతో ప్రభావితం చేశాయన్నారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి దార్ల బుజ్జిబాబు, డివిజన్ అధ్యక్షురాలు చెరుకూరి సృజన, పాఠశాల డైరెక్టర్ పోపూరి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మరమ్మతుల కారణంగా రోడ్డుపై ఆగిపోయిన లారీ

● గంటల కొలది రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు

● తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులు, విద్యార్థులు

వినుకొండ, సెప్టెంబరు 21: గ్రానైట్ తరలించే భారీ లారీ మరమ్మతుల కారణంగా రోడ్డుపై నిలిచిపోవడంతో సుమారు ఒకటిన్నర గంటలపాటు రోడ్డుపై వాహన రాకపోకలు నిలిచిపోయాయి. ఈ ఘటన మండలంలోని ఉమ్మడివరం గ్రామ సమీపంలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే ఉమ్మడి వరం గ్రామ సమీపంలో గ్రానైట్ ఫ్యాక్టరీల ద్వారా భారీ గ్రానైట్ రాళ్లను తరలించే వాహనం వినుకొండ- అద్దంకి ప్రధాన రహదారిపైకి చేరడంతో లారీ ఇంజన్‌లో మరమ్మతుల కారణంగా రోడ్డుపై ఆగిపోయింది. లారీపై వందల టన్నుల గ్రానైట్ రాళ్లు ఉండడంతో ప్రయానికులు ఏమీ చేయాలేని పరిస్థితి. దీంతో సాయంత్రం ఇంటికి చేరాల్సిన విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ గ్రామాలకు చెందిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆర్టీసీ బస్సులు సైతం ఆగిపోవడంతో గంటల కొలది నిలిచిపోయిన ట్రాఫిక్‌తో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

సవరించిన చట్టాలపై అవగాహన సదస్సు

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 21: సవరించిన నూతన క్రిమి నల్ మేజర్ చట్టాలపై శనివారం పట్టణంలోని రామిరెడ్డిపేటలో గల ఓ కల్యాణమండపంలో ఏపీపీలకు, పోలీసులకు, పోలీసుల అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదనరావు ప్రధాన వక్తగా పాల్గొన్నారు. ఆయన కేసు నమోదు చేసిన తర్వాత అభియోగ పత్రం కోర్టులో దాఖలు చేసే సమయంలో తీసుకోవాల్సిన విధానాలు వివరించారు. సిబ్బంది లేవనెత్తిన వివిధ సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో 39 మంది ఏపీపీలు, పోలీసు సిబ్బంది, అధి కారులు పాల్గొన్నారు. కార్యక్రమానికి పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీని వాసరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమ అనంతరం మధుసూదనరావును ఎస్పీ ఘనంగా సన్మానించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సన్మానం

శావల్యాపురం, సెప్టెంబరు 21: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం తరఫున జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై కలెక్టర్ నుంచి ఇటీవల అవార్డులను అందుకొన్న తుమ్మలకుంట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం, ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శి బిళ్లా రాజారమేష్, శావల్యాపురం జడ్పీ పాఠశాలలో గణితశాస్త్ర ఉపాధ్యాయులు కుమ్మరి శ్రీనివాసరాజు, స్పోర్ట్ ఎక్సెలెన్సీ అవార్డును పొందిన పీడీ రాగుల రాధాకృష్ణమూర్తిలను స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో ఎంఈవోలు, హెచ్‌ఎంలు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు శనివారం ఘనంగా సత్కరించారు.

శ్రీవారి లడ్డును అపవిత్రం చేయటం సిగ్గు చేటు

● వంద రోజుల్లో వందకు పైగా మంచి పనులు

● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

నూజెండ్ల, సెప్టెంబరు 21: కోట్లాది మంది భక్తులు ఆరాధించే వేంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదాన్ని అపవిత్రం చేయడం సిగ్గు చేటని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. నూజెండ్లలో శనివారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించి వంద రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద జరిగిన సభలో మాట్లాడుతూ జగన్ పాలనలో రాష్ట్రం అన్ని విధాలా నష్టపోయిందని, ప్రజలకు ఎటువంటి మేలు జరగక పోగా లక్షల కోట్ల రూపాయల అప్పును మిగిల్చారని అన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో కృషి, పాలనా దక్షత వల్ల నేడు ప్రభుత్వ పాలన సజావుగా సాగుతూ సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతున్నాయన్నారు. అవినీతి లేకుండా పాలన అందిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వంలో నాయకులందరూ శక్తి వంచన లేకుండా కృషి చేస్తూ అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ జెడ్డా సుబ్బులు రామయ్య, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, నియోజకవర్గ పరిశీలకులు మానుకొండ శివప్రసాదు, డీఎల్‌డీఏ చైర్మన్ లగడపాటి వెంకటరావు, జనసేన నాయకులు నిశ్శంకరరావు, శ్రీనివాసరావు, నాగ శ్రీను రాయల్, గంగినేని ఆంజనేయులు, రొడ్డా వీరాంజనేయ రెడ్డి, సర్పంచ్ వీర్ల వెంకట స్వామి, గంగినేని బ్రహ్మయ్య, లగడపాటి సూరిబాబు, బేతపూడి చిరంజీవి, తహసీల్దార్ జీ రమేష్‌కుమార్, ఈవో పీఆర్‌డీ రవికుమార్, టీడీపీ నాయకులు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒకే ఇంట్లో అధిక జాబ్ కార్డులు

● సంతకాలు, వేలి ముద్ర లేకుండా బిల్లుల చెల్లింపు

● ప్రజావేదికలో సోషల్ ఆడిట్ బృందాలు వెల్లడి



ప్రజావేదికలో పాల్గొన్న పీడీ జోసెఫ్ కుమార్, జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి

రొంపిచర్ల, సెప్టెంబరు 21: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 16వ విడత ప్రజావేదిక కార్యక్రమం శనివారం జరిగింది. వారం రోజుల నుంచి సోషల్ ఆడిట్ బృందాలు మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై తనిఖీలు నిర్వహించారు. ఆయా పనులకు సంబంధించి వివరాలను వెల్లడి చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో కూలీలకు సంబంధించి రూ.8.66 కోట్ల పనులకు సంబంధించి తనిఖీలు జరిగాయి. కాగా అధికశాతం గ్రామాల్లో జాబ్ కార్డులు అప్‌డేట్ చేయలేదని, ఒకే ఇంట్లో రెండు జాబ్ కార్డులు మంజూరు చేశారని తనిఖీ బృందాలు గుర్తించాయి. ఎడ్వర్డుపేటలో ఉద్యాన పంటల కింద సాగు చేసిన ఏడు వందల మొక్కల్లో మూడు వందలు మాత్రమే ఉన్నాయని అన్నారు. సంతకాలు, వేలి ముద్రలు లేకుండా నగదు చెల్లించారన్నారు. విప్పర్ల పల్లి గ్రామంలో సర్పంచ్ సంతకం లేకుండా పనులు చేపట్టారన్నారు. పనికి సంబంధించిన వివరాలను పొందు పరచలేదన్నారు. గ్రామసభలకు కేటాయించిన అధికారులు హాజరుకాలేదని తెలిపారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్, జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఎస్‌టీఎం లోకేశ్వరరెడ్డి, ఎస్ఆర్‌పీ రాజు, ఎంపీడీవో మాథ్యూబాబు, ఏపీవో ప్రసాదు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరు.. ఆలస్యంగా సోషల్ ఆడిట్ ప్రజావేదిక

ఉదయం 11గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం మధ్యాహ్నం 2గంటల తరువాత ప్రారంభమైంది. ఉపాధి హామీ పీడీ గంగవరపు జోసెఫ్‌కుమార్ ఆలస్యంగా రావటంతో సమావేశ సమయాన్ని మార్చారు. మధ్యాహ్నం 3గంటల తరువాత ప్రారంభించారు. సమావేశాన్ని గతంలో పనిచేసిన ఫీల్డ్ అసిస్టెంట్‌ల సంఖ్య కూడా నామమాత్రంగానే ఉంది. కూలీలు, కొన్ని గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు హాజరుకాలేదు.

ఇన్‌సర్వీస్ కోటాలో సీట్లు నష్టపోతున్న డాక్టర్లు

ఫణిదం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రదీప్



నల్లరిబ్బన్లు ధరించి మౌనదీక్ష చేస్తున్న జిల్లా పీహెచ్‌సీ వైద్యాధికారులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 21: ఇన్‌సర్వీస్ కోటలో డాక్టర్లు సీట్లు నష్టపోతున్నారని ఫణిదం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ అన్నారు. శనివారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణలో జీవో 85 రద్దు చేయాలని కోరుతూ నల్ల రిబ్బన్లు ధరించి మౌన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ జీవో 85ని ప్రభుత్వం జూలై 20న పీజీ ఇన్‌సర్వీస్ కోటాకు సంబంధించి విడుదల చేశారన్నారు. ఈ జీవో ద్వారా క్లినికల్ బ్రాంచ్‌లు 30 శాతం ఉన్న సీట్లు 15 శాతానికి తగ్గించారని, నాన్ క్లినికల్ బ్రాంచ్‌లకు ఉన్న 50 శాతం ఉన్న సీట్లును 30 శాతంకు తగ్గించారన్నారు. దీనివల్ల దాదాపు 250 సీట్లు ఇన్ సర్వీస్ కోటాలో డాక్టర్లు నష్టపోతున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యం చేయడానికి డాక్టర్లకు ఇన్‌సర్వీస్‌లో పీజీ చేసుకొని సేవలు అందించడానికి అవకాశం లేకుండా పోతుందన్నారు. ప్రభుత్వం వెంటనే జీవో 85ను రద్దుచేసి, న్యాయమైన కోరికలను పరిష్కరించాలని కోరారు. డాక్టర్ ఎన్ వెంకట రమణ మాట్లాడుతూ జీవో 85లో సవరణలను రద్దు చేయాలన్నారు. మేము ప్రభుత్వానికి తోడుగా, మాకు ప్రభుత్వం తోడుగా ఉండాలని కోరుకుంటున్నామని, ఈ నిరసన ప్రభుత్వానికి వ్యతిరేకం కాదన్నారు. వైద్య విద్య ఏది తక్కువ కాదని తెలియజేయటానికి ఈ నిరసన కార్యక్రమం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీలలో పనిచేస్తున్న మెడికల్ ఆఫీసర్‌లు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

శావల్యాపురం, సెప్టెంబరు 21: స్కూల్‌గేమ్స్ పోటీల్లో అత్యున్నత ప్రతిభ చూపి నియోజకవర్గస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన శావల్యాపురం జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులకు పాఠశాల ప్రాంగణంలో శనివారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం బొడ్డపాటి విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 19, 20 తేదీల్లో మండలంలోని వేల్పూరు జడ్పీ పాఠశాలలో జరిగిన స్కూల్‌గేమ్స్ పోటీల్లో శావల్యాపురం జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్-17 బాలుర విభాగంలో యోగాలో ప్రథమ స్థానాన్ని, కబడ్డీ, షటిల్, చెస్‌లలో ద్వితీయ స్థానాన్ని సాధించారని, అండర్-17 బాలికల విభాగంలో యోగా, చెస్‌లలో ప్రథమ స్థానాన్ని, కబడ్డీ, షటిల్‌లో ద్వితీయ స్థానాన్ని సాధించారని, అండర్-14 బాలికల విభాగంలో యోగాలో ప్రథమ స్థానాన్ని, కబడ్డీ, షటిల్, చెస్‌లలో ద్వితీయ స్థానాన్ని; అండర్-14 బాలుర విభాగంలో ఖోఖోలో ద్వితీయ స్థానాన్ని సాధించారన్నారు. అంతేకాక అథ్లెటిక్స్ రన్నింగ్‌లో 8వ తరగతి బాలిక తులసి మూడు బంగారు పతకాలను, షార్ట్‌పుట్ త్రోలో 10వ తరగతి బాలుడు మల్లికార్జునరావు బంగారు పతకాన్ని, షార్ట్‌పుట్ త్రోలో 9వతరగతి బాలుడు ప్రసన్న సిల్వర్ పతకాన్ని సాధించారన్నారు. త్వరలో నియోజకవర్గస్థాయిలో జరిగే పోటీల్లో కూడా వీరంతా బాగా రాణించాలని కోరారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, వారికి శిక్షణనిచ్చిన పీడీ రాగుల రాధాకృష్ణమూర్తిని పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్, హెచ్‌ఎం విజయలక్ష్మి, స్టాఫ్ సెక్రటరీ టీవీ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు శ్రీనివాసరాజు, భువనేశ్వరి, ఆదాం ఖాన్, అబ్దుల్లా, శ్రీనివాసరావు, శ్రీకాంత్ తదితరులు అభినందించారు.

ఓరియంటల్ హైస్కూల్లో డీవైఈవో తనిఖీ



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీవైఈవో కె.వేణుగోపాల్

నరసరావుపేట కల్చరల్, సెప్టెంబరు 21. పట్టణంలోని బరంపేటలో ఉన్న ఓరియంటల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను నరసరావుపేట ఉప విద్యాశాఖాధికారి కె.వేణుగోపాల్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. గణితంలో ప్రశ్నలు అడిగి విద్యార్థులను పరీక్షించారు. విద్యార్థుల నోటు పుస్తకాలను పరిశీలించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ప్రధానోపాధ్యాయుడు బి.సత్యనారాయణను ఆదేశించారు. ఉపాధ్యాయుల టీచింగ్ నోట్స్‌ను, పాఠశాల రికార్డులను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుశాతం పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం స్టాఫ్‌తో సమావేశం ఏర్పాటు చేసి వారికి పలు సూచనలు చేశారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. తర్వాత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

విద్యార్థుల ఆలోచనలను లక్ష్యం వైపు మళ్లించాలి

● ఈశ్వర్ ఇంజనీరింగ్ ఫ్రెషర్స్ డేలో డీఎస్పీ నాగేశ్వరరావు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 21 : విద్యార్థుల ఆలోచనలు లక్ష్యం వైపు కాకుండా మత్తు వంటి చెడు వ్యసనాల వైపు వెళుతున్నాయని డీఎస్పీ కే నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడు తూ క్షణికావేశాలకు లోనై చిన్నపాటి నేరాలకు పాల్పడి తల్లి దండ్రులకు బాధ కలిగిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రూరల్ సీఐ పి.రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మంచి అలవట్లు పెంపొందించుకొని లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆటల పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం డీఎస్పీ నాగేశ్వరరావు, సీఐ రామకృష్ణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ షేక్ మీరావలి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహీద్దీన్, ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ షేక్ నజీమా, ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కంచర్లలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం

వినుకొండటౌన్, సెప్టెంబరు 21: మండలంలోని పెద్ద కంచర్ల గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద అధికారులు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి గ్రామ పరిశుభ్రతపై పజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ ప్రభాకర్, ఈవోపీఆర్‌డీ సుందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మెహన్ చందు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నూజెండ్ల మండలంలో

నూజెండ్ల, సెప్టెంబరు 21: మండలంలోని గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో గ్రీన్ అంబాసిడర్లతో కలసి ర్యాలీ నిర్వహించి పరిసరాల శుభ్రత గురించి వివరించారు.

పోలింగ్ బూత్‌లపై చర్చించిన నాయకులు

వినుకొండ టౌన్, సెప్టెంబరు 21: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినుకొండ నియోజకవర్గం ప్రత్యేకాధికారి శ్రీరాములు ఆధ్వర్యంలో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్‌పై వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులతో శనివారం చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 299 పోలింగ్ స్టేషన్లున్నాయని, 1500 ఓటర్లు పైబడిన పోలింగ్ బూత్‌లను పరిశీలించి నూత న పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసుకోవచ్చని ప్రజాప్రతినిధులకు సూచించారు. వినుకొండలో 1500లకు పైబడిన పోలింగ్ బూత్‌లు లేవని పార్టీల నాయకులు ఆయన దృష్టికి తెచ్చారు.

23న నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు

రొంపిచర్ల, సెప్టెంబరు 21: రొంపిచర్ల జడ్పీ పాఠశాలలో నియోజకవర్గ స్థాయి పలు ఆటల పోటీలను ఈనెల 23వ తేదీన నిర్వహించనున్నట్టు హెచ్‌ఎం సుభానీ శనివారం తెలిపారు. ఆరు రకాల విభాగాల్లో నరసరావుపేట, రొంపిచర్ల మండలాలకు సంబంధించి పోటీలు జరుగుతాయన్నారు. నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన వారు జిల్లా స్థాయిలో ఆడతారని తెలి పారు.

క్రాపు బుకింగ్‌కు ఈకేవైసీ తప్పనిసరి

నూజెండ్ల, సెప్టెంబరు 21 : మండలంలోని రైతులు ఈపంట నమోదు అనంతరం ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో సుగుణాబేగం సూచించారు. శనివారం స్థానిక రైతు సేవాకేంద్రంలో ఈకేవైసీ నమోదుపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఈకేవైసీ చేయించుకోవడం ద్వారా పంట రుణాలు, సున్నా వడ్డీ, పెట్టుబడి రాయితీలు, పంటల బీమా తదితర అంశాల్లో రైతులకు ప్రయోజనాలు చేకూరతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో ఎల్ ఎలీషా, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో అనేక అక్రమాలు జరిగాయి

ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు



ల్యాబ్ రిపోర్టును ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, విజయకుమార్, శేఖర్ తదితరులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 21: వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతిలో అనేక అక్రమాలు జరిగాయని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శనివారం నరసరావుపేట టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ దేవుడి మీదా ప్రేమలేని వ్యక్తిని జగన్మోహన్‌రెడ్డిని అధ్యక్షుడిగా ఉంచారన్నారు. టీటీడీ లడ్డులో స్వచ్ఛమైన ఆవు నెయ్యిని మాత్రమే వాడాలన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా వైసీపీ నేతలు వ్యహరించారన్నారు. మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఈ విషయంలో ఎంతో సిగ్గుపడాలన్నారు. తప్పు చేసిన వారు ఎంత పెద్ద వారైనా కూటమి ప్రభుత్వం విడిచిపెట్టదన్నారు. నరసరావుపేట బిర్యానీ సెంటర్లలో కల్తీ నూనె వాడుతున్నారని, అటువంటి హోటళ్లపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్, బ్రాహ్మణ సేవాసమితి ప్రతినిధి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వత్తిడితోనే అధికశాతం జబ్బులు

● డాక్టర్ కామినేని అచ్యుతబాబు



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ కామినేని అచ్యుతబాబు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 21: అధిక శాతం వ్యాధులు వత్తిడి కారణంగానే వస్తున్నాయని కామినేని వెల్త్ క్రియేటర్స్ ఎండీ డాక్టర్ కామినేని అచ్యుతబాబు అన్నారు, శనివారం ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో గ్లోబల్ డాక్టర్స్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందరికీ ఆరోగ్యం, సంపద అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కామినేని అచ్యుతబాబు మాట్లాడుతూ వత్తిడిని తగ్గించుకుంటే వ్యాధుల నుంచి బయట పడవచ్చునని అన్నారు. ప్రతిరోజు తీసుకునే ఆహారంలో స్వల్పమార్పులు చేసుకుంటూ, వ్యాయామం చేస్తూ వత్తిడిని తగ్గించుకోవచ్చుని గుర్తు చేశారు. సంపాదన సృష్టించే పలు మార్గాలను తెలియజేస్తూ ఆ సంపదను మనతోపాటు సమాజానికి కూడా సేవ చేయడానికి వినియోగించాలని అన్నారు. కార్యక్రమానికి ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం ప్రసాదరావు అధ్యక్షత వహించారు. సదస్సులో ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ రామారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ కేసులో నిందితుడి అరెస్టు

యడ్లపాడు, సెప్టెంబరు 21 : జాతీయ రహదారిపై యడ్లపాడు మండలం తిమ్మాపురం పరిధిలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు మృతి చెందిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు జిల్లా నిడమర్రుకు చెందిన వడల కృష్ణ, ఈబుచర్ల రవికిషోర్‌లు అదే గ్రామానికి చెందిన మోహన్ వద్ద హోల్డింగ్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. ఈ నెల 14న రొయ్యల శాంపిల్స్ తెచ్చేందుకు కారులో నెల్లూరుకు వెళ్లారు. శాంపిల్స్ తీసుకుని గమ్యస్థానానికి బయలు దేరారు. 15వ తేదీ తెల్లవారుజామున తిమ్మాపురం పరిధిలోని తిరుమల ఆయిల్ మిల్లు వద్దకు రాగానే టైరు పంక్చర్ అయ్యింది. దీనితో పక్కనే ఆపుకుని టైరు మార్చుకుంటుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లింది. దీనితో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గుర్తు తెలియని వాహనాన్ని గుర్తించేందుకు ఎస్ఐ బాలకృష్ణ హైవేపై తిమ్మాపురం, చిలకలూరిపేటలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల ఫుటేజిని పరిశీలించినప్పటికి ఆధారాలు దొరకలేదు. దీనితో రూరల్ సీఐ సుబ్బనాయుడు సూచనలతో సంఘటనా స్థలంలో దొరికిన ఆధారాలతో బొల్లాపల్లి టోల్‌ప్లాజా వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి నంబరు ప్లేటు లేకుండా వెళ్లిన వాహనాన్ని గుర్తించారు. చాయిస్ నంబరుతో ఆన్‌లైన్‌లో ఈ చలానా యాప్‌లో చెక్ చేసి వాహనం నంబరు, అడ్రసును రాబట్టారు. ఒంగోలు వెళ్లి అడ్రస్‌లోని ఫోన్ నంబరుకు కాల్ చేసి బాడుగకు రావాలని అడుగ్గా.. సదరు వాహనడ్రైవర్ బండి రిపేరులో ఉంది, ఒంగోలులోని అశోక్ లేలాండ్ షోరూంలో ఉన్నట్లు చెప్పాడు. దీనితో పోలీసులు షోరూంకు చేరుకుని డ్రైవర్‌ను, వాహనాన్ని యడ్లపాడు స్టేషన్‌కు తరలించారు.

ఎస్ఐను అభినందించిన ఐజీ

చాకచక్యంగా వ్యవహరించి ఇద్దరు డ్రైవర్ల మృతికి కారణమైన నిందితుడిని, వాహనాన్ని పట్టుకున్న ఎస్ఐ బాలకృష్ణను ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అభినందించారు. శుక్రవారం నరసరావుపేటలో జరిగిన క్రైమ్ మీటింగ్‌లో ఎస్ఐ బాలకృష్ణను, రూరల్ సీఐ సుబ్బనాయుడును అభినందించి నగదు రివార్డును అందజేశారు.



ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి నుంచి రివార్డు అందుకుంటున్న ఎస్ఐ బాలకృష్ణ, సీఐ సుబ్బనాయుడు పక్కన ఎస్పీ కె.శ్రీనివాసరావు

లాటరీ టిక్కెట్ల విక్రేత అరెస్టు

యడ్లపాడు, సెప్టెంబరు 21 : నిషేధిత లాటరీ టిక్కెట్లను విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. యడ్లపాడులోని శివాలయం వీధికి చెందిన షేక్ బాజి ఆన్‌లైన్ లాటరీ యాప్‌లో ఇతర రాష్ట్రాలకు చెందిన సింగిల్ నంబరు లాటరీ టిక్కెట్లు డౌన్‌లోడ్‌చేసి విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. శుక్రవారం రాత్రి యడ్లపాడు మసీదు సెంటర్లో లాటరీ టిక్కెట్లు అమ్ముతుండగా నిఘా వేసిన పోలీసులు బాజీని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉన్న లాటరీ నంబర్ల షీట్‌ను, రూ.3,400ల నగదును స్వాధీనం చేసుకున్నారు. కూలీలను లక్ష్యంగా చేసుకుని బోడోల్యాండ్, నాగాలాండ్, సిక్కిం తదితర రాష్ట్రాలకు చెందిన లాటరీ టికెట్లను ఒక్కొక్కటి రూ.40 నుంచి రూ.500కు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదుచేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా లాటరీ టిక్కెట్ల అమ్మకాలు, కొనుగోళ్లకు అనుమతులు లేవన్నారు. ఎవరైనా అక్రమంగా లాటరీ టిక్కెట్లు విక్రయిస్తే వారిపై కేసు నమోదు చేస్తామన్నారు.

హ్యూమన్ రైట్స్ జిల్లా ఉపాధ్యక్షుడిగా కమలారామ్

వినుకొండటౌన్, సెప్టెంబరు 21: నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరెప్షన్ బ్యూరో ఆఫ్ ఇండియా పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన కమలారామ్ శనివారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అభినందనలు తెలిపారు.

'స్పందన' ఏర్పాటు చేయాలి

వినుకొండటౌన్, సెప్టెంబరు 21: వినుకొండ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం ఏర్పాటు చేయాలని సీపీఐ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, మరొ కొంతమంది పట్టణ ప్రజలు శనివారం మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వినుకొండ మున్సిపల్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం ఎందుకు నిర్వహించడంలేదని కమిషనర్‌ను ప్రశ్నించారు.